




ESTD: 1999 www.voodayam.com

# వుదయం

కరీంనగర్ | 25-06-2026 గురువారం | సంపుటి : 14 | సంచిక :189 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on



సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్ 46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం




* తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నాం. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారు.

- కెటిఆర్

## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

# రెన్యువల్ సీఎం

- 72సార్లు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి ఏం సాధించారు
- బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణ రాష్ట్రం నష్టపోయింది
- కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు

**సత్తుపల్లి, జూన్ 24 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మరోసారి విమర్శలు చేశారు బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి,

మిగతా 2లో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నీటిపారుదల, శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీనియర్ ఇంజినీర్లు, జలవనరుల నిపుణులు, అధికారులు పాల్గొన్నారు. తెలంగాణకు కేటాయించిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన ఇంజినీరింగ్, పరిపాలనా, అంతర్రాష్ట్ర సమన్వయ చర్యలపై చర్చించారు.

* ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పని చేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తాం. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే.. ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తా.

- సీఎం రేవంత్‌రెడ్డి

## సర్ విషయంలో

## పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులనూ మార్చేస్తాం

# ఎవరినీ ఉపేక్షించను

- సర్ తో బీజేపీ కుట్ర చేస్తోంది
- అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు
- ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే
- ఉంటూ మానిటరింగ్ చేయాలి
- తనకి ఒక నియోజకవర్గం
- కేటాయిస్తే వెళ్లి పనిచేస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్

**హైదరాబాద్, జూన్ 24 (వుదయం ప్రతినిధి) :** సర్ విషయంలో సీరియస్‌గా లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఫైర్ అయ్యారు. బుధవారం కాంగ్రెస్ నేతలతో ముఖ్యమంత్రి జూమ్ మీటింగ్ నిర్వహించారు. సర్ అంశంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. సర్ తో బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరో వ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది.

మిగతా 2లో



### ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదు

2

- ఓటు అనేది ప్రతి
- మనిషికి సోషల్ స్టేటస్
- తెలంగాణ కాంగ్రెస్ పార్టీ
- వ్యవహారాల ఇన్ ఛార్జి
- మీనాక్షి నటరాజన్

# అప్పుల రాష్ట్రంగా మార్చారు

## ఆ నలుగురివి మాయమాటలు.. ప్రజలు నమ్మొద్దు

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయింది
- రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాం

డిప్యూటీ సీఎం
మల్లు భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూన్ 24 (వుదయం ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయ మాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో

మిగతా 2లో

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా

**నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**అవగాహన ఒప్పందంపై సంతకాలు**


**హైదరాబాద్, జూన్ 24 (వుదయం ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలలో ఆర్థిక భద్రతను పెంపొందించే దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో అద్భుతమైన సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన సమగ్ర ఉచిత ప్రమాద బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 14 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయనుంది. ఉద్యోగులపై కానీ, ప్రభుత్వ ఖజానాపై కానీ ఎలాంటి ప్రీమియం భారం పడకుండా కేవలం జీతాల ఖాతాలు ఉండే బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఈ ఉచిత బీమాను అందించడం దేశ చరిత్రలోనే ఇది మొదటిసారి కావడం విశేషం.ఈ సరికొత్త బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులతో

మిగతా 2లో

## జల హక్కులను

# విస్మరించిన కాంగ్రెస్

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించింది
- తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలు విరమించాలి
- ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలి
- ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం :సిఎంకు లేఖరాసిన హరీశ్ రావు



**హైదరాబాద్, జూన్ 24 (ఎఎంఎస్) :** తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటి. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరా డి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసింది'. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది.

మిగతా 2లో



## ఖమేనీ అంత్యక్రియలకు

# మోడీకి పిలుపు

- ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్
- ఆహ్వానం : వెల్లడించిన దౌత్య వర్గాలు
- కేంద్ర ప్రభుత్వం నుంచి రాని అధికారిక
- ప్రకటన : వచ్చే నెలలో అంత్యక్రియలు

**న్యూఢిల్లీ, జూన్ 24 (వుదయం బ్యూరో) :** అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో మృతిచెందిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు వచ్చే నెలలో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు దౌత్య వర్గాలు బుధవారం వెల్లడించాయి. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటనేదీ రాలేదు. లై 5 నుంచి 9 వరకు ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమం జరగనుంది. తొలుత టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించి కొన్ని కార్యక్రమాలు చేపట్టనున్నారు. 9వ తేదీన ఖమేనీ స్వస్థలం మషాద్‌లో ఆయనను ఖననం చేయనున్నట్లు తెలుస్తోంది.ఇరాన్ పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టిన తొలి రోజే 86 ఏళ్ల అలీ ఖమేనీ, మరో 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ కుటుంబంలో కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందగా.. కుమారుడు మొజ్తాబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అలీ ఖమేనీ మరణంతో.. మొజ్తాబాను సుప్రీం లీడర్‌గా ఎన్నుకొన్న సంగతి తెలిసిందే.

# అంగరంగ వైభవంగా బోనాలు నిర్వహించాలి

- బోనాల నిర్వహణకు ప్రభుత్వం 20 కోట్లు మంజూరు
- తెలంగాణ అంటే బోనాలు.. బోనాలు అంటే తెలంగాణ
- అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలి
- బోనాల ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు
- లేకుండా ఘనంగా నిర్వహించాలి
- హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్


2




## పవన విద్యుత్తుతో

# సముద్రం అడుగున 'డేటా సెంటర్'

- నీటి వినియోగం అత్యల్పం
- పునరుత్పాదక శక్తితో పనిచేస్తుంది
- భూ ఆధారిత డేటా సెంటర్లపై
- చాలా ప్రాంతాల్లో వ్యతిరేకత
- ప్రభుత్వ యాజమాన్యంలోని
- చైనా కమ్యూనికేషన్స్ కన్‌స్ట్రక్షన్ సంస్థ,
- హైక్లౌడ్ టెక్నాలజీలు ఏర్పాటు



**వుదయం వెబ్;** ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా పవన విద్యుత్తుతో నడిచే డేటా సెంటర్‌ను నీటి అడుగున ఏర్పాటుచేసింది. షాంఘై తీరంలోని ఈ డేటాసెంటర్ భూమిపై ఉన్న డేటాసెంటర్లతో పోలిస్తే ఐదోవంతు తక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. నీటి వినియోగం అత్యల్పం. మే నెలలో ప్రారంభమైన షాంఘై లింగాంగ్ సముద్రగర్భ డేటా సెంటర్ ప్రాజెక్టు 24 మెగావాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రభుత్వ యాజమాన్యంలోని చైనా కమ్యూనికేషన్స్ కన్‌స్ట్రక్షన్ సంస్థ, హైక్లౌడ్ టెక్నాలజీలు సంయుక్తంగా దీన్ని ఏర్పాటుచేశాయి. షాంఘై తీరానికి 6 మైళ్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న ఈ డేటాసెంటర్, సముద్ర నీటి ఉపరితలానికి

2లో



## కుప్పకూలిన భారీ గోడౌన్

- కలకత్తాలో ఎనిమిదిమంది దుర్మరణం
- శిథిలాల కింద 40 మందికి కార్మికులు
- ప్రాణాలను కాపాడేందుకు సహాయక చర్యలు

**కోల్ కత్తా, జూన్ 24 :** నిర్మాణ రంగంలో భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం మరోసారి ఘోరకలిని మిగిల్చింది. నగరంలో నిర్మాణంలో ఉన్న ఒక భా రీ గోడౌన్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది

2లో

# రాష్ట్రంలో నేటి నుంచి సర్

- జులై 24 వరకు ఇంటింటి సర్వే
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం




**హైదరాబాద్, జూన్ 24 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో నేటి నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. 33 మంది జిల్లా ఎన్నికల అధికారులు, 119 మంది ఓటర్ రిజిస్ట్రేషన్ అధికారులు, 882 మంది ఏఈఆర్ఓలు, 35,935 బూత్ స్థాయి అధికారులు (బీఎల్వో), 3,596 సూపర్‌వైజర్లు, 49,018 ఏజెంట్లను నియమించింది. పని విభజనపై ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. బీఎల్వో ప్రతి ఇంటిని సందర్శించి రెండు ప్రతుల ఓటరు నమోదు ఫారంలను అందజేస్తారు. బీఎల్వో ఇంటిని సందర్శించినప్పుడు ఇల్లు తాళం వేసి ఉంటే, కనీసం మూడు సార్లు సందర్శిస్తారు. ఓటర్లు తమ నమోదు ఫారంలను ఆన్‌లైన్‌లో కూడా డౌన్లోడ్ చేసుకుని పూరించి సమర్పించవచ్చు. ఓటర్లు తమ పేరు లేదా తమ తల్లిదండ్రులు, తాత లేదా అమ్మమ్మ పేర్లు 2002 ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితా లో ఉన్నట్లయితే వాటి వివరాలను కూడా నమోదు చేయవలసి ఉంటుంది. నిర్దిష్ట సమయంలో నమోదు ఫారం సమర్పించలేని ఓటర్లు, క్లెయిమ్ లు, అభ్యంతరాల కాలంలో నిర్దేశిత ప్రకటన ఫారం తో పాటు ఫారమ్–6 సమర్పించి పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలు సమర్పించని ఓటర్ల విషయంలో ఈఆర్వో, ఏఈఆర్వోలు విచారణ ప్రారంభిస్తారు. విచారణ సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఫారం 8 ద్వారా నియోజకవర్గం లోపల లేదా బయట నివాస మార్పు, వివరాల సవరణ చేసుకోవచ్చు. క్లెయిమ్ లు,

మిగతా 2లో

# సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించను

మొదటి పేజీ తరువాయి



పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు' అని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యేలపై పీసీసీ అధ్యక్షుడి ఫైర్.. జూమ్ సమావేశంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సర్ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. సర్ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజ న్‌అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నేటి నుంచి సర్

మొదటి పేజీ తరువాయి

అభ్యంతరాల పరిష్కారం అనంతరం తుది ఓటరు జాబితాను అక్టోబర్1న ప్రచురిస్తారు. ఎన్యుమరేషన్ ఫాం నింపని వారు తమ ఓటును కోల్పోతారని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి వ్యక్తి ఫాం నింపి స్థానిక బీఎల్ఓకు అందజేయాల్సి ఉంటుంది. సర్వేలో భాగంగా జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికీ ఎన్యుమరేటర్లు తిరుగుతారు. ఆ నెల 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తారు. జులై 31 నుంచి ఆగస్టు 08 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆగస్టు 28 వరకు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. అనంతరం తుది ఓటరు జాబితాను అక్టోబరు ఒకటిన ప్రచురిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. మొత్తం 19,942 పోలింగ్ స్టేషన్లు ఉండగా, ఇందులో పట్టణ ప్రాంతాల్లో 14,750, గ్రామీణ ప్రాంతాల్లో 21,157 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం జనాభా 3,50,03,674 మంది ఉండగా, ఇందులో పురుషులు 1,176,11,633, మహిళలు 1,173,92,041 మంది ఉన్నారు.

# కుప్పకూలిన భారీ గోడౌన్

మొదటి పేజీ తరువాయి



కార్మికులు అ క్కడికక్కడే ప్రాణాలు కోల్పో గా, శి థిలాల కింద మరో 40 మందికి పై గా కార్మికులు చి క్కుకుపోయినట్లు తెలుస్తోంది. మాద తీవ్రతతో ప్రస్తుత పరిస్థితి ప్రకారం మృతుల సంఖ్య 8 మంది ప్రాథమిక సమాచారం ప్రకారం చిక్కుకుపోయిన వారు 40 మంది కి పైగా కార్మికులు ఉన్నారు. ప్రమాద స మ యంలో సుమారు50 నుం డి 60 మంది కార్మికులు విధులు ని ర్వహిస్తున్నారు. గాయపడిన క్షత గాత్రులను స్థానిక ఆసు పత్రులకు తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు.. స్థలానికి చేరుకున్న విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక పోలీసులు శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమ య్యారు. కాలంతో పోటీ పడుతూ, శిథిలాల కింద చిక్కుకు న్న ప్రాణాలను కాపాడేందుకు సహాయక చర్యలు ముమ్మ రంగా కొనసాగుతున్నాయి.భవన నిర్మాణంలో నాణ్యతాలో పాలు ఉన్నాయా లేదా అనే కోణంలో అధికారులు దర్యా ప్తు ప్రారంభించారు. బాధితుల కుటుంబాల్లో ప్రస్తుతం తీవ్ర విషాదం అలుముకుంది.

## పవన విద్యుత్తుతో సముద్రం
# అడుగున 'డేటా సెంటర్'

మొదటి పేజీ తరువాయి

10 మీటర్ల లోతులో మునిగి ఉంది. సమీపంలోని ఆఫ్‌షోర్ విండ్‌ఫార్మ్ ద్వారా శక్తిని పొందుతుంది. పునరుత్పాదక శక్తితో పనిచేస్తుంది, సముద్రపు నీటిలో మునిగి ఉంటుంది కాబట్టి సహజ శీతలీకరణ గుణంతో విద్యుచ్ఛక్తి అవసరం తగ్గుతుంది. సంప్రదాయ, భూ–ఆధారిత డేటాసెంటర్‌లో సర్వర్‌లు వేడెక్కకుండా నిరోధించడానికి వాటి చుట్టూ చల్లటి నీటిని పైపుల ద్వారా పంపించాల్సి ఉంటుంది. దానివల్ల మొత్తం విద్యుత్ డిమాండులో దాదాపు 25–40 శాతం వాటికే ఖర్చవుతుంది. ఇక వాటి నీటి వినియోగమూ ఎక్కువే. అందుకే భూ ఆధారిత డేటా సెంటర్లపై చాలా ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనికి విరుగుడుగా చైనా సముద్రం అడుగున డేటా సెంటర్‌ను ప్రారంభించింది. నిజానికి నీటి అడుగున ఉండే డేటాసెంటర్లు అవక్షేపాలను కదిలించడం లేదా సముద్రపు నీటిని వేడి చేయడం ద్వారా సముద్ర జీవావరణ వ్యవస్థలకు కొన్ని ప్రమాదాలను కూడా సృష్టిస్తాయి. అందువల్ల వీటి విషయంలో మరింత జాగ్రత్తలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# అంగరంగ వైభవంగా బోనాలు నిర్వహించాలి

**బోనాల నిర్వహణకు ప్రభుత్వం 20 కోట్లు మంజూరు**

**తెలంగాణ అంటే బోనాలు.. బోనాలు అంటే తెలంగాణ**

**అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలి**

**బోనాల ఉత్సవాలను భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించాలి**

**హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, జూన్ 24 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బోనాల పండుగకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన బోనాల ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్ జిల్లా, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని దాశరథి ఆడిటోరియంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోనాలు కేవలం ఒక మతపరమైన పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక చిహ్నమని అన్నారు. ఆషాఢ మాసం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు హైదరాబాద్‌కు తరలివస్తారని, అమ్మవారి దర్శనం కోసం వివిధ దేవాలయాలను సందర్శిస్తారని చివరి భక్తునికి కూడా అమ్మవారి దర్శనాన్ని కల్పించాలని దేవదాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు . బోనాలు, గణేష్ ఉత్సవాలు, రంజాన్, మొహర్రం వంటి భారీ మతపరమైన, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం హైదరాబాద్ యంత్రాంగానికి ఉందని, అదే సమన్వయం, ప్రణాళిక, అంకితభావంతో బోనాల ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, లక్షలాది మంది భక్తులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఆలయాలకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నిరంతరం పెంచుతూ వస్తోందని పేర్కొన్నారు. 2021లో 1,028 ఆలయాలకు, 2022 మరియు 2023లో చెరో 1,073 ఆలయాలకు, 2024లో 1,253 ఆలయాలకు, 2025లో రికార్డు స్థాయిలో 3,026 ఆలయాలకు రూ.5.80 కోట్ల ఆర్థిక సహాయం అందించిందన్నారు. అర్హత కలిగిన ఆలయాల గుర్తింపు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, భక్తుల రద్దీ, ఆలయ అవసరాలు, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సహాయం అందించాలని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యంత్రాంగాలకు, దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసిన మంత్రి, ప్రధాన ఆలయాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలు, పుష్పాల అలంకరణలు, తాగునీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ, పారిశుద్ధ్య నిర్వహణ, క్యూలైన్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, వైద్య శిబిరాలు, అత్యవసర స్పందన వ్యవస్థలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని వినియోగించుకునే భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశమున్నందున టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. గోల్కొండ, బాల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, సబ్జీ మండి, అక్కన్న మాదన్న ఆలయాల వద్ద అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు, ట్రాఫిక్, ఇంటెలిజెన్స్, జీహెచ్ఎంసీ, ఇతర పౌర శాఖలు సమగ్ర భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ, జనసమ్మర్థ నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మహిళా భక్తులు, విధుల్లో పాల్గొనే మహిళా సిబ్బంది భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ముందస్తు ప్రణాళికల ద్వారా సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. బోనాల పండుగ విశిష్టత, చరిత్ర, సంప్రదాయాలు, కార్యక్రమాల షెడ్యూల్, ట్రాఫిక్ ఆంక్షలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సమాచార, పౌర సంబంధాల శాఖను మంత్రి ఆదేశించారు. బోనాల విశిష్టతపై ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం గావించాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణ సందర్భంగా అధికారులందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని మంత్రి సూచించారు. గోల్కొండ బోనాల చారిత్రక ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ, ఆషాఢ మాసం సందర్భంగా గోల్కొండ కోటను సందర్శించే భక్తులకు పురావస్తు శాఖ ఉచిత ప్రవేశాన్ని కొనసాగించాలని మంత్రి సూచించారు. తెలంగాణ సంస్కృతి, విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన బోనాల ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిపూర్వకంగా, వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు, ఆలయ కమిటీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు నిర్వహించనున్న బోనాల ఉత్సవాల్లో భాగంగా జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవస్థానంలో జాతర తో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆషాఢ మాసంలోని ఐదు గురువారాలు, నాలుగు ఆదివారాల్లో గోల్కొండలో జాతర ఉత్సవాలు నిర్వహించబడతాయి మరియు రాష్ట్ర ప్రభుత్వం జూలై 16న పట్టు వస్త్రం సమర్పించనుంది. జూలై 21న బాల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో కళ్యాణోత్సవం, పట్టు వస్త్రాల సమర్పణ, జూలై 22న రథోత్సవం జరుగుతాయి. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ప్రధాన బోనాల ఉత్సవాలు, పట్టు వస్త్రాల సమర్పణ నిర్వహించబడగా, ఆగస్టు 3న రంగం కార్యక్రమం, అంబారీ ఊరేగింపు నిర్వహించబడతాయి. ఆగస్టు 9న ఇతర ప్రధాన ఆలయాల్లో ప్రభుత్వ తరఫున పట్టు వస్త్రాల సమర్పణ జరగనుంది. అదే రోజు సబ్జీ మండి, కార్వాన్ ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించబడగా, ఆగస్టు 10న హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయంలో ఉత్సవాలు నిర్వహించబడతాయి. ఉత్సవాల కాలమంతా ఘటోత్సవం, బోనం సమర్పణ, తొట్టెల ఊరేగింపులు, పోతురాజు విన్యాసాలు, శివసత్తుల కార్యక్రమాలు, రంగం, తదితర సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. అంతకుముందు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వర్చువల్ విధానంలో సమావేశంలో పాల్గొని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బోనాలఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం మైనారిటీల సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ ఈ చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికలు, సమర్థవంతమైన అమలు అవసరమని అన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కూడా సమావేశంలో బోనాల విశిష్టత గురించి మాట్లాడారు.

సమావేశంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, డీజీపీ సీవీ ఆనంద్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మేడ్చల్–మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ సృజన, టీజీఎస్‌పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ జి ముకుంద రెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై. నాగిరెడ్డి, రోడ్లు భవనాల శాఖ, రవాణా, టీజీఎస్ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు, ఉమ్మడి ఆలయ కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అప్పుల రాష్ట్రంగా మార్చారు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

**రైతులను ఆదుకోవడంలో బిఆర్ఎస్ విఫలం: తుమ్మల**

రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు.

ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా**

పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందితో కలిపి దాదాపు 10 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. బ్యాంక్ ఖాతాల ద్వారా జీతాలు పొందే ప్రతి ఉద్యోగికి ఈ రక్షణ లభిస్తుంది. ఉద్యోగి జీతం పొందే బ్యాంకు నిబంధనలను బట్టి ప్రమాదవశాత్తు మరణిస్తే కనీసం రూ.60 లక్షల నుండి గరిష్టంగా రూ.1.2 కోట్ల వరకు వారి కుటుంబ సభ్యులకు పరిహారం అందుతుంది. ఒకవేళ విమాన ప్రమాదంలో మరణిస్తే ఈ పరిహారాన్ని రూ.2 కోట్లకు పెంచారు. గతంలో సింగరేణి కాలరీస్ కార్మికులకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ విధానాన్ని అమలు చేయగా, అక్కడ దురదృష్టవశాత్తు మరణించిన సుమారు 45 మంది కార్మికుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందింది. ఈ పథకం విజయవంతం కావడంతో ప్రభుత్వం ఇప్పుడు దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది.

# జల హక్కులను విస్మరించిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి

నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసం? కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కర్ణాటక నుంచి ఎన్‌వోసీ తెస్తున్నాం అనే సాకు చెప్పి, తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా మార్చారా? తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి (2 టిఎంసి), చిక్కాలపర్వి (2.5 టిఎంసి)), చిక్కాలమంచి (5 టిఎంసి)) బ్రిడ్జ్–కమ్–బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు?' రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? లేక తెలిసే ఇదంతా చేస్తున్నారా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదు?' 'సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదు? దీని వెనుక ఉన్న లోపాయికారి ఒప్పందాలు ఏమిటి?' 'ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఉంది. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం, వాటిని దెబ్బతీసే కర్ణాటక అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా సహకరించడం రాష్ట్రానికి ద్రోహం చేయడం కాదా?' అని హరీశ్ రావు ప్రశ్నించారు. 'ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఆర్డీఎస్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేసీఆర్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. చివరి ఆయకట్టులోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టింది. కేసీఆర్ గారు ప్రారంభించిన RDS ఫేస్ 2 ను పడావు పెట్టిన మీరు, ఇప్పుడు కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది.'చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణ పేట, కొడంగల్ కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని పక్కనబెట్టారు. కమీషన్ల కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసారు. 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు. ఇప్పుడు ఆర్డీఎస్ విషయంలో కర్ణాటకతో లోపాయికారి ఒప్పందం చేసుకొని పాలమూరు రైతాంగానికి మరోసారి అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఇది కేవలం ఒక ప్రాజెక్టు సమస్య కాదు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన అంశం. తుంగభద్ర జలాలను కర్ణాటక ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అనేక నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరచింది. అయినప్పటికీ ఆ నిబంధనలు ఖాతరు చేయకుండా, ఎటువంటి అనుమతులు లేకుండా బ్రిడ్జికం బ్యారేజీలను, ఎత్తిపోతల పథకాలను నిర్మించడానికి పూనుకుంటున్నది. ఇంత ద్రోహం జరుగుతుంటే మీరు, మీ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడం తెలంగాణా ప్రయోజనాలకు ద్రోహం తలపెట్టడం కాదా ?' అని ప్రశ్నించారు.

## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు
# రెన్యువల్ సీఎం

మొదటి పేజీ తరువాయి

పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అత్యవసరమైతే తప్ప
# ఇరాన్‌కు ప్రయాణం వద్దు

**భారత్ అడ్వైజరీ**

**న్యూఢిల్లీ, జూన్ 24 (వుదయం బ్యూరో) :** అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం ముగింపు ప్రకటనతో పశ్చిమాసియాలో ఇప్పుడిప్పుడే ఉద్రిక్తతలు చల్లారుతున్నాయి. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ తమ అడ్వైజరీ ని సవరించింది. అయితే, ఇరాన్‌లో పరిస్థితులు కాస్త మెరుగుపడినప్పటికీ.. ప్రస్తుతానికి ఈ దేశానికి అనవసర ప్రయాణాలు మానుకోవాలని భారత పౌరులకు సూచించింది. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రాన్‌లోని భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఇక్కడ సానుకూల పరిణామాలు నెలకొంటున్నాయి. అయినప్పటికీ ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం. స్థానిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అధికారులు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలి. ఇక, తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు చేయొద్దు. అనివార్య కారణాల వల్ల ఈ దేశానికి రావాలనుకునేవారు ఎంబసీ అధికారులను సంప్రదించి మీ వివరాలను నమోదు చేసుకోండి. ఎంబసీ సోషల్ మీడియా ఖాతాలు, అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు ఫాలో అవుతూ ఉండండి'' అని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. మెరికా–ఇరాన్ మధ్య యుద్ధం ముగింపునకు సంతకాలు జరిగినప్పటికీ.. హర్మూజ్ నిర్వహణ, అణు కేంద్రాల పరిశీలన వంటి అంశాల్లో రెండు దేశాల మధ్య భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. బాంబు దాడుల్లో దెబ్బతిన్న అణు కేంద్రాల్లో తనిఖీల కోసం అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) ఇన్‌స్పెక్టర్లను అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆయన ప్రకటనను ఇరాన్ ఖండించింది. మరోవైపు, హర్మూజ్‌ను మూసేశామని టెహ్రాన్ చెబుతుండగా.. అది తెరిచే ఉందని అమెరికా అంటోంది. ఈ గందరగోళం నడుమ పశ్చిమాసియాలో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

# దివ్యాంగురాలిపై అత్యాచారం

**హైదరాబాద్, జూన్ 23 (వుదయం ప్రతినిధి) :** నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోరమైన ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నదివ్యాంగురాలిపై ఓ దుర్మార్గుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలికి మాట్లాడే, వినే శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహిళ మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

# మానవీయ కోణంలో ప్రజల సమస్యలు పరిష్కరించండి

**నిత్యం ప్రజలతో మమేకం కావాలి**

**సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం నిరంతర ప్రక్రియగా కొనసాగాలి**

**ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికపై**

**కరీంనగర్ జిల్లా కలెక్టర్**

**పవర్ పాయింట్ ప్రెసెంటేషన్**




**కరీంనగర్, జూన్ 24 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో కరీంనగర్ జిల్లాను అగ్రభాగాన నిలపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుండి నేరుగా కరీంనగర్ కలెక్టరేట్ కి చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రజలకు సేవలు అందించడం అధికారుల అదృష్టంగా భావించాలని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు . జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని సమస్యల పరిష్కారం ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అని అన్నారు , రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, ప్రజలకు పాలనను చేరువ చేసేందుకే ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు.ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు విజయవంతం చేయడమే కాకుండా , అధికారులు పథకాల సద్వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి లో ప్రభుత్వ పథకాల అమలు పై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, అద్దె బస్సుల నిర్వహణ వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని స్పష్టం చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



## విద్యార్థినిలు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

**- ప్రభుత్వ కళాశాలలలో ప్రవేశాలు పెరగాలి**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల జూన్ 24**
**(వుదయం కరస్పాండెంట్)**

విద్యార్థినిలు చదువులు మధ్యలో ఆపేయకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.బుధవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పలు తరగతి గదుల్లోని విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. ఎంతమంది ఇంప్రూవ్మెంట్ కోసం సప్లమెంటరీ పరీక్షలను రాసారని అడిగారు. విద్యార్థులు నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక సాధన చేయాలన్నారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీకి సంబంధించిన ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేలా ప్రత్యేక తరగతులు నిర్వహించి, శిక్షణ ఇవ్వాలని అధ్యాపకులను ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలలో ప్రవేశాలు పెరగాలని, అడ్మిషన్స్ కోసం వచ్చే విద్యార్థులను కళాశాలలో చేర్చుకోకుండా వేరే విద్యాలయాలకు రేఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కళాశాల పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిజిటల్ బోర్డులను తరగతి గదుల్లో ఇన్స్టాల్ చేయించి వినియోగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఈ పర్యటనలో డిఐఈఓ హృదయ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు తదితరులున్నారు.

## మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యం లో జగదాంబ సరస్వతి మమ్మాకు ఘన నివాళి

**శేరిలింగంపల్లి -జూన్ 24**
**(ఉదయం ప్రతినిధి )**



చందానగర్ డివిజన్ హుడా కాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం హుడా కాలనీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో జగదాంబ సరస్వతి మమ్మా 61వ వర్ధంతి పుణ్యతిథి సందర్భంగా నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకుడు మిరియాల ప్రీతమ్ పాల్గొని మమ్మాకు ఘన నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మమ్మా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడుతూ, జగదాంబ సరస్వతి మమ్మా జీవితమంతా ఆధ్యాత్మిక సేవ, మానవతా విలువలు, సమాజ శ్రేయస్సు కోసం అంకితం అయిందని అన్నారు. ఆమె చూపిన సేవా మార్గం నేటి యువతకు ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ బ్రహ్మకుమారి సంస్థ తొలి ముఖ్య కార్యనిర్వాహకురాలిగా మమ్మా వేలాది మంది జీవితాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపి, సేవా తత్వానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఆమె త్యాగం, క్రమశిక్షణ, ప్రేమ, సహనం వంటి గొప్ప గుణాలను స్మరించుకుంటూ ఆమెకు ఘనంగా శ్రద్ధాంజలి అర్పించారు. హుడా కాలనీ సేవా కేంద్ర ఇన్చార్జ్ బీకే సరోజ్ కార్యక్రమాన్ని నిర్వహించి మమ్మా సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్రహ్మకుమారులు, బ్రహ్మకుమారీలు, ఆధ్యాత్మిక సాధకులు పాల్గొని మమ్మా జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

"మమ్మా ఆశయాలను ఆచరిస్తూ సమాజ సేవలో ముందుండాలి" అని మిరియాల ప్రీతమ్ పిలుపునిచ్చారు.

## కోహిర్ మెథడిస్ట్ చర్చ్ లే లీడర్ కు ఘనంగా సన్మానం



**కోహిర్ జూన్ 24**
**(వుదయం ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల్ సెంట్రల్ మెథడిస్ట్ చర్చ్ సంఘస్తుల కోరిక మేరకు కోహిర్ సెంట్రల్ మెథడిస్ట్ చర్చ్ లే లీడర్ గా ఎన్నుకోబడిన సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే కొన్నింటి మాణికరావు సెంట్రల్ చర్చి లే లీడర్ సందీప్ కుమార్ ఎన్నికైన సమాచారం తెలుసుకొని వారిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వాగతిస్తూ వారికి శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కలీం, బి ఆర్ ఎస్ యువ నాయకులు మీథున్ రాజ్, అఖిల్,అస్లామ్,సందీప్,ఇమ్రాన్,అజర్, వాజిద్,సలీం, నిరంజన్, అజ్మత్, సమద్, స్టీఫెన్, రాజరత్నం, కోహిర్ మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పలుగోన్నారు.

## కాలనీల్లో మెట్టు కుమార్ పర్యటన

**పటాన్చెరు (వుదయం):**



కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ స్థానికంగా పర్యటించి సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా శాంతి నగర్ శ్రీరామ్ కాలనీ సొసైటీ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు షకీల్ (లడ్డు)తో కలిసి కాలనీలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ముందుగా మంజీరా స్కూల్ సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా జామ్ కావడంతో ఏర్పడిన సమస్యను పరిశీలించారు. అనంతరం సత్యసాయి బాబా దేవాలయం సమీపంలో ఉన్న ప్రధాన మోరి పూర్తిగా మూసుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిన పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.

స్థానికులు సమస్యలను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు .ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ మరియు మురుగునీటి సమస్యలు తీవ్రతరం కాకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీవాసుల ఆరోగ్యం, పారిశుధ్య పరిరక్షణ కోసం శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరి గోస్వామి ,కార్యవర్గ సభ్యులు షకీల్ (లడ్డు), కాలనీవాసి మధు మరియు ఇతర స్థానికులు పాల్గొన్నారు.

## హలో ఉప సర్పంచ్ – చలో హైదరాబాద్

**- విజయవంతం చేయాలని పిలుపు**
**- సిద్దిపేట జిల్లా ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు మద్దూరి రాజు**
**వుదయం, సిద్దిపేట**



ఉప సర్పంచ్ల చెక్ పవర్ను రద్దు చేయనున్నారనే వార్తలను సిద్దిపేట జిల్లా ఉప సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు మద్దూరి రాజు తీవ్రంగా ఖండిస్తూ నేడు ( గురువారం ) హైదరాబాద్ లో జరిగే ధర్నా చౌక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీసిద్దిపేట జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మద్దూరి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా మిర్దొడ్డి మండల కేంద్రంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా ధన వినియోగంపై పర్యవేక్షణలో ఉప సర్పంచ్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఉప సర్పంచ్ల హక్కులను పరిరక్షిస్తూ, చెక్ పవర్ను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జూన్ 25న హైదరాబాద్లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న "హలో ఉప సర్పంచ్ - చలో హైదరాబాద్" మహాధర్నా కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉప సర్పంచ్లు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.గ్రామ పంచాయతీల్లో పారదర్శక పరిపాలన కొనసాగాలంటే ఉప సర్పంచ్లకు చెక్ పవర్ అత్యంత అవసరమని, ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై స్పష్టత ఇచ్చి ఉప సర్పంచ్ల అధికారాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు పరుశురాములు, భాస్కర్, కరుణాకర్, బాలరాజ్, బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నాన్ని కలిసిన ముత్తయ్య



**- ఐదు దశాబ్దాల కాంగ్రెస్ సేవలను మంత్రికి వివరించిన ఎస్సీ సెల్ వైస్ చైర్మన్**
**- పార్టీకి చేసిన సేవలను గుర్తించి కార్పొరేషన్ చైర్మన్ పదవి కల్పించాలని విజ్ఞప్తి**
**- కాంగ్రెస్ బలోపేతానికి జీవితాంతం కృషి చేస్తానని కడమంచి ముత్తయ్య స్పష్టం**

**హైదరాబాద్,**
**జూన్ 24 (వుదయం):**

హైదరాబాద్లోని గాంధీభవన్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ కడమంచి ముత్తయ్య మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై మంత్రితో సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం తాను ఎన్నో సంవత్సరాలుగా చేసిన సేవలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.కడమంచి ముత్తయ్య మాట్లాడుతూ గత యాభై సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించానని వివరించారు. పార్టీ పట్ల తనకు ఉన్న అంకితభావం, నిబద్ధతను మంత్రికి వివరించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా పార్టీ కోసం తాను అందించిన సేవలను గుర్తించి, తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవిలో అవకాశం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ను వినయపూర్వకంగా కోరినట్లు తెలిపారు. సామాజిక వర్గాల అభివృద్ధి, పార్టీ విస్తరణ కోసం తాను చేసిన కృషిని నాయకత్వం పరిశీలించి తగిన గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.పార్టీ అధిష్టానం తీసుకునే ప్రతి నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని కడమంచి ముత్తయ్య స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్ల తనకు పూర్తి విశ్వాసం ఉందని, పార్టీ ఆదేశాల మేరకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తానని అన్నారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని కడమంచి ముత్తయ్య పేర్కొన్నారు. పార్టీ శ్రేణులను ఐక్యంగా నడిపిస్తూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేయడానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విజయమే తన ధ్యేయమని, పార్టీ అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా మరింత అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## భక్తితోనే జీవితానికి పరిపూర్ణత....



**-హిమాలయ పరమహంస వేదానంద సరస్వతిస్వామిజీ**
**-సాయిబాబా, దత్తాత్రేయస్వాములను దర్శించుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**
**-ఘనంగా ముగిసిన శ్రీగురుపీఠం వార్షికోత్సవం**
**వుదయం న్యూస్ శివ్వంపేట,**

భక్తి అనేది కేవలం దేవాలయంకు పరిమితం కాకుండా ప్రతీ మనిషి జీవన విధానంలో భాగం కావాలని అప్పుడే మనసుకు ప్రశాంతత, జీవితానికి సార్థకత అవుతుందని హిమాలయ పరమహంస వేదానంద సరస్వతిస్వామిజీ అన్నారు. బుధవారం మండలంలోని గూడురు గ్రామంలో శ్రీగురుపీఠం ఆలయ ప్రథమ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలు శ్రీగురుపీఠం ఛైర్మన్ శివకుమారౌడ్, వేద పండితులు వామనశర్మల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఉదయం హిమాలయ పరమహంస వేదానంద సరస్వతిస్వామిజీ హాజరై 108 కలశాల గంగాజలాలతో అభిషేకం, హోమం నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి హిమాలయ పరమహంస వేదానంద సరస్వతి స్వామిజీ మాట్లాడారు. భగవంతుని పై విశ్వాసం, గురువులపై గౌరవం, తల్లిదండ్రుల సేవ, సమాజ సేవ వంటి విలువలను ప్రతీ ఒక్కరు అలవరుచుకోవాలని అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై సాయిబాబా, దత్తాత్రేయ మహాస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా శ్రీగురుపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, ఆత్మకమిటీ మాజీ ఛైర్మన్ గౌరె వెంకట్రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్రెడ్డి, సర్పంచ్లు బేగరి నర్సయ్య, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మిశ్రీనివాస్ గౌడ్, నారాయణరావు, సీనియర్ నాయకులు యాదాగౌడ్, మర్రి మహేందర్రెడ్డి, ట్రస్టు సభ్యులు సూర్యంకుమార్ గౌడ్ , రాజ్యం భిక్షపతి తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సాత ప్రవీణ్ కుమార్...**
**శంకర్ పల్లి**
**జూన్ 24 (వుదయం)**



ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ సూచించారు. బుధవారం సిటిజన్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంస్థలు జరిపే ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కాగా ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్ పరీక్ష, ఈసీజీ, రొమ్ము ఆరోగ్య పరీక్ష, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 250 మంది పట్టణ ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, కమిషనర్ యోగేష్, మేనేజర్ వి. అంజన్ కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, డాక్టర్లు పాల్గొన్నారు

## కాలనీల సమస్యలపై మెట్టు కుమార్ ప్రత్యేక దృష్టి

**- జేపీ కాలనీ, శాంతినగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యల పరిశీలన – తక్షణ పరిష్కారానికి ఆదేశాలు**
**- కాలనీవాసుల ఇబ్బందులు తొలగించడమే లక్ష్యం – SFA గోవింద్తో కలిసి విస్తృత పర్యటన చేసిన మెట్టు కుమార్ యాదవ్**

**పటాన్చెరు, జూన్ 24**
**(వుదయం/సురేష్):**



పటాన్చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ, వరద నీటి సమస్యలపై మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఉదయం SFA గోవింద్ను వెంట తీసుకుని జేపీ కాలనీ, శాంతినగర్, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని సూచించారు.జేపీ కాలనీ రోడ్ నంబర్-3, రోడ్ నంబర్-5, ఎంజీ రోడ్ భగత్ గల్లీ ప్రాంతాల్లో పర్యటించిన మెట్టు కుమార్ యాదవ్, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా జామ్ కావడంతో మురుగునీరు మ్యాన్హోల్స్ ద్వారా బయటకు పొంగి పొర్లుతున్న పరిస్థితిని పరిశీలించారు. దీంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీ లైన్లను తక్షణమే శుభ్రపరిచి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అలాగే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్లపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలను ఓపికగా విన్న మెట్టు కుమార్ యాదవ్, ప్రజల ఇబ్బందులను వెంటనే తగ్గించే చర్యలు చేపట్టాలని SFA గోవింద్కు సూచించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు.అనంతరం శాంతినగర్, శ్రీనగర్ కాలనీలలో పర్యటించిన ఆయన అక్కడి డ్రైనేజీ వ్యవస్థ పరిస్థితిని పరిశీలించి, ఉప్పొంగుతున్న మ్యాన్హోల్స్ కారణంగా ఏర్పడుతున్న సమస్యలను గోవింద్కు వివరించారు. GHMC సిబ్బందితో కలిసి రోడ్లపై నిలిచిన వరదనీటిని తొలగించే చర్యలు చేపట్టించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో జబ్బార్, రెహమాన్, ముస్తఫా, చింతల బస్తీ అంజిరెడ్డి, షకీల్ లడ్డు, రవీంద్ర గిరి తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాలనీవాసులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే స్పందించిన మెట్టు కుమార్ యాదవ్కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.





## బాలికల జూనియర్ కళాశాల ను ప్రారంభించిన ఎంపీ



**నారాయణపేట టౌన్ జూన్ 24(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని పెదిరిపహడ్ గ్రామంలో 2.30 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల, అదనపు తరగతి గదులను ఎంపీ డీకే అరుణ బుధవారం ప్రారంభించారు. అనంతరం కస్తూర్బా కళాశాల విద్యార్థినులతో ఎంపీ డీకే అరుణ ముచ్చటిస్తూ ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆ పాఠశాల ఎస్.వో. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

**- సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజేందర్ గౌడ్**
**నారాయణపేట జూన్ 24**
**(వుదయం ప్రతినిధి**

పేట జిల్లా లో వివిధ గ్రామాలలో నెలకొన్న సమస్య ల పరిష్కరానికి కృషి చేస్తానని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు రాజేందర్ గౌడ్ అన్నాడు. బుధవారం పేట శీల గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి, కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జి తిరుపతి రెడ్డి, పేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి సారథ్యంలో పేట మండల గ్రామ సర్పంచిల సమస్యలు పరిస్కరిస్తా అన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకు సర్పంచి సంఘం అధ్యక్షులు గా అవకాశం వచ్చిందని నమ్మకం తో బాధ్యత అప్పగించిన వారికి ధన్యవాదములు తెలిపారు. బూత్ లెవల్ లో పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తా అన్నారు. త్వరలో ప్రతి గ్రామం ను సందర్శించి సమస్యలు పరిస్కరిస్తా అన్నారు. అనంతరం వివిధ మండల అధ్యక్షులు, సర్పంచి లు శాలువాతో సన్మానం చేశారు.కార్యక్రమం లో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ శివా రెడ్డి, సూర్య మోహన్ రెడ్డి, కోట్ల రవీందర్ రెడ్డి, శరణప్ప, వివిధ మండల అధ్యక్షులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.




"ఎస్ఐఆర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదు. పని చేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తాం. సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలి. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు.. దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉంది. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉంది. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉంది."

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## వే'మన'పద్యం

గంగిగోవు పాలు గంటెడైనను చాలు
కడివెడైనవేల ఖరముపాలు
భక్తికలుగు కూడు పట్టెడైననుజాలు
విశ్వదాభిరామ! వినురవేమ



# దండకారణ్యం.. ఒక నిశ్శబ్ద మానవ బాంబు

అంతర్జాతీయ వేదికలపై పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల ముప్పు గురించి భారతదేశం సుదీర్ఘ ఉపన్యాసాలు ఇస్తోంది. కానీ, ఆచరణలో దేశీయంగా జరుగుతున్న విధానపరమైన నిర్ణయాలు మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో విస్తరించిన దండకారణ్యం కేవలం ఒక అటవీ భూభాగం మాత్రమే కాదు; అది ఈ ఉపఖండపు ఉష్ణోగ్రతలను నియంత్రించే ఒక సహజసిద్ధమైన రక్షణ కవచం. అలాంటి మహారణ్యాన్ని భూగర్భంలోని ఇనుము, బొగ్గు, బాక్సైట్ వంటి అశాశ్వత లోహాల కోసం కార్పొరేట్ శక్తులకు లీజుల రూపంలో దారాదత్తం చేయడం దేశ భవిష్యత్తును శాశ్వత దివాలా వైపు నెట్టడమే. ఈ పచ్చని హననాన్ని కేవలం చట్టాల ఉల్లంఘన కోణంలోనే చూస్తే అసలు ప్రమాదం పక్కదారి పడుతుంది. ఇది దేశాన్ని అంతర్గతంగా అతలాకుతలం చేయబోతున్న ఒక నిశ్శబ్ద మానవ బాంబు అనే సత్యాన్ని గ్రహించాల్సి ఉంది. అడవుల నిర్మూలనను కేవలం "చెట్లు నరకడం" అనే కోణంలో చూడలేం. ఇది ఒక భారీ మానవతా సంక్షోభానికి దారితీస్తోంది. తరతరాలుగా ప్రకృతితో మమేకమై బతుకుతున్న ఆదివాసీలను వారి మూలాల నుండి వేరు చేసినప్పుడు, వారు కేవలం నివాసాలు మాత్రమే కోల్పోవడం లేదు; తమ అస్తిత్వాన్ని, జీవన నైపుణ్యాలను కూడా పూర్తిగా కోల్పోతున్నారు. ఒక ఊరిలో ఒకే ఒక్క ఎకరం పొలంతో గౌరవంగా బతికే పేద రైతును.. ఆ పొలం కింద ఖనిజాలు ఉన్నాయనే నెపంతో కొద్దిపాటి డబ్బులిచ్చి వెళ్లగొడితే, అతడు నగరంలోని మురికివాడలో కూలీగా మారాల్సి వస్తుంది. దండకారణ్యంలో ఉన్న గిరిజనుల పరిస్థితి ఇప్పుడు సరిగ్గా ఇదే. ఇలా బలవంతంగా నిర్వాసితులైన లక్షలాది మంది అడవి బిడ్డలు నేడు ఆధునిక నగరాల అంచుల్లో పారిశ్రామిక కూలీలుగా, అనామక వలస కార్మికులుగా మారుతున్నారు. ప్రస్తుత మైనింగ్ నమూనా పూర్తిగా "లాభాలు కొందరికి – నష్టాలు అందరికీ" అనే ప్రమాదకరమైన సూత్రంపై నడుస్తోంది. అడవులను నరికి, భూమిని తవ్వి తీసే వనరుల ద్వారా వచ్చే వందల వేల కోట్ల రూపాయల లాభాలు కేవలం కొద్దిమంది కార్పొరేట్ దిగ్గజాల బ్యాంకు ఖాతాలను నింపుతున్నాయి. కానీ, దానివల్ల కలిగే శాశ్వత విధ్వంసాన్ని—అంటే గాలి కలుషితం కావడం, జీవనాధులైన నదులు ఎండిపోవడం, భూగర్భ జలాలు విషతుల్యం కావడం వంటి నష్టాలను మాత్రం దేశ పౌరులంతా సమిష్టిగా భరించాల్సి వస్తోంది. మండుటెండల్లో పెద్ద మర్రిచెట్టు నీడ ఎంత హాయినిస్తుందో, దేశానికి దండకారణ్యం అలాంటి ఒక ఉచిత, సహజమైన ఏసీ లాంటిది. ఇప్పుడు అక్కడ ఉన్న ఖనిజాల కోసం ఆ అడవిని నరికేయడం అంటే.. ఎండకాలంలో మన ఇంట్లో ఉన్న ఏసీని పగలుకొట్టుకుని, లోపల ఉన్న కాపర్ వైర్లను అమ్ముకున్నట్టే! డబ్బులు వస్తాయి కానీ, ఆ తర్వాత వేడికి అల్లాడిపోవాల్సి వస్తుంది. ఖనిజ సంపద అత్యధికంగా ఉన్న జిల్లాలే భారతదేశంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్నాయంటే, అక్కడ జరుగుతున్నది 'దేశాభివృద్ధి' ఎలా అవుతుంది? కొద్దిమంది సంపద పెరిగినప్పుడు కాదు... అట్టడుగు సమాజాలు తమ స్వంత నేలపై గౌరవంగా బతికినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. ఇకనైనా భారతదేశం తన వృద్ధి రేటును కొలిచే సాంప్రదాయ ఆర్థిక సూచీలను మార్చాల్సిన అవసరం ఉంది. కేవలం పారిశ్రామిక విస్తరణను కాకుండా, పర్యావరణ విలువను లెక్కగట్టే 'హరిత జీడీపీ' విధానాన్ని అత్యంత ప్రాధాన్యతగా అమలు చేయాలి. గనుల తవ్వకం ద్వారా వచ్చే తక్షణ ఆదాయం కంటే.. ఆ అడవి నిలబడి ఉండడం వల్ల దేశానికి లభించే స్వచ్ఛమైన ఆక్సిజన్, వాతావరణ సమతుల్యత, నదుల జీవన కాలం ఎంత అనే కోణంలో ప్రకృతి విలువను శాస్త్రీయంగా లెక్కగట్టాలి. మన ఇంట్లో 50 ఏళ్ల నాటి పెద్ద మామిడి చెట్టును నరికేసి.. "దీనికి బదులుగా ఇంటి వెనకాల ఒక చిన్న మొక్క నాటుతాను" అంటే ఒప్పుకుంటామా? కంపెనీలు అడవులను నరికేసి, "మేము వేరే చోట మొక్కలు నాటుతాం" అని చెప్పడం కూడా సరిగ్గా ఇలాంటిదే. వందల ఏళ్ల పరిణామక్రమంలో ఏర్పడిన జీవ వైవిధ్యాన్ని కృత్రిమంగా పెంచే తోటలు ఎప్పటికీ పునరుద్ధరించలేవు. దండకారణ్యంపై జరుగుతున్న ఉక్కుపాదం కేవలం ఒక ప్రాంతపు భూమిపై జరుగుతున్న దాడి కాదు; అది ఈ దేశ భవిష్యత్ తరాల శ్వాసపై జరుగుతున్న దాడి. ప్రకృతిని కేవలం లాభాలు పిండుకునే ఒక సరుకుగా చూసే యాంత్రిక ధోరణిని పాలకులు తక్షణమే వీడాలి. అభివృద్ధి అంటే అడవిని నరకడం కాదు.. అడవిని బతికిస్తూ, నదులను కాపాడుకుంటూ మానవ జీవన ప్రమాణాలను పెంచడం. మన పిల్లలకు పీల్చడానికి మంచి గాలి, తాగడానికి స్వచ్ఛమైన నీరు అందించడమే నిజమైన అభివృద్ధి. ఈ నిశ్శబ్ద మానవ బాంబు పేలక ముందే పర్యావరణ సమతుల్యతను, అట్టడుగు ప్రజల అస్తిత్వాన్ని కాపాడుకునే దిశగా దేశం సమిష్టిగా అడుగులు వేయాలి. శ్వాసించే హక్కును పణంగా పెట్టి సాధించే ప్రగతి ప్రగతి కాదు... అది వినాశనానికి రహదారి!



రాజేందర్ దామెర
సీనియర్ జర్నలిస్ట్

# ఓటర్ల జాబితా ప్రక్షాళనా.. ప్రజాస్వామ్యానికి పరీక్షనా?

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం ఒక రాజ్యాంగబద్ధ హక్కు మాత్రమే కాదు; అది ప్రజల చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం. ప్రభుత్వాలను ఏర్పాటు చేసే శక్తి, అధికారాలను మార్చే సామర్థ్యం, విధానాలను ప్రభావితం చేసే బలం అన్నీ ఓటు ద్వారానే వ్యక్తమవుతాయి. అందుకే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉంటే అంతగా ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం బలపడుతుంది. అదే ప్రక్రియ రాజకీయ అనుమానాలకు తావిస్తే, అది కేవలం పరిపాలనా అంశంగా కాకుండా ప్రజాస్వామ్య భవిష్యత్తుకు సంబంధించిన చర్చగా మారుతుంది. తెలంగాణలో జూన్ 25 నుంచి ప్రారంభమవుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రస్తుతం అలాంటి చర్చలకు కేంద్రబిందువుగా మారింది.

### తెలంగాణలో బీజేపీ 'గెలుపు వ్యూహం'గా ఎస్ఐఆర్?

జూన్ 25 నుంచి జూలై 24 వరకు తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటి సర్వే రూపంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) చేపడుతున్నారు. ఎన్నికల సంఘం దీన్ని ఓటర్ల జాబితాను నవీకరించే సాధారణ ప్రక్రియగా పేర్కొంటోంది. అయితే ప్రతిపక్ష పార్టీలు, పౌర సంఘాలు మాత్రం దీనిని 2028 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించే అవకాశముందని ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు 89 లక్షల ఓటర్ల రికార్డులు పరిశీలనకు గురవుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో ఇది కేవలం జాబితా సవరణ ప్రక్రియేనా? లేక తెలంగాణ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక పరిణామమా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### ఆందోళనలకు కారణాలేమిటి?

విమర్శకుల అభిప్రాయం ప్రకారం మైనారిటీలు, పేదలు, మహిళలు, వలస కార్మికులు వంటి వర్గాలు ఇలాంటి ప్రక్రియల్లో ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. చిరునామా మార్పులు, గుర్తింపు పత్రాల లేమి, పేర్లలో అక్షర దోషాలు, సమాచార లోపాలు వంటి కారణాలతో అర్హులైన ఓటర్ల పేర్లు కూడా జాబితా నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.బూత్ స్థాయి అధికారులు నిర్వహించే ఇంటింటి సర్వేలో పొరపాట్లు జరిగితే లేదా స్థానిక స్థాయిలో పక్షపాతం చోటుచేసుకుంటే, కొన్ని వర్గాల ఓటర్లు అన్యాయానికి గురయ్యే అవకాశాన్ని కూడా ప్రతిపక్షాలు ప్రస్తావిస్తున్నాయి. గతంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణల సందర్భంగా వివాదాలు తలెత్తిన సందర్భాలను ఉదాహరణగా చూపిస్తూ తెలంగాణలో కూడా అలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని రాజకీయ పార్టీలు హెచ్చరిస్తున్నాయి.

**ప్రతిపక్షాల ఆరోపణలు..** బీఆర్ఎస్ నాయకత్వం ఈ ప్రక్రియపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తోంది.



బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసే వర్గాల పేర్లను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. కాంగ్రెస్ కూడా ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నట్లు చెబుతోంది. ఏఐఎంఐఎం, వామపక్ష పార్టీలు, ఇతర ప్రాంతీయ రాజకీయ శక్తులు కూడా మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ జాగ్రత్త అవసరమని సూచిస్తున్నాయి.

### బీజేపీ, ఎన్నికల సంఘం వాదన

ఈ ఆరోపణలను బీజేపీ పూర్తిగా ఖండిస్తోంది. ఓటర్ల జాబితాలో ఉన్న నకిలీ నమోదులు, మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వివరాలను తొలగించడం మాత్రమే లక్ష్యమని ఆ పార్టీ చెబుతోంది. ఎన్నికల సంఘం కూడా ఇదే వాదన వినిపిస్తోంది. ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని పెంచడం, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం, ఎన్నికల వ్యవస్థను మరింత విశ్వసనీయంగా మార్చడం కోసం మాత్రమే ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. పేరు తొలగింపుకు ముందు నోటీసులు ఇవ్వడం, అభ్యంతరాలు స్వీకరించడం, అప్పీలు చేసుకునే అవకాశాలు కల్పించడం వంటి చట్టబద్ధ విధానాలు అమల్లో ఉంటాయని కూడా స్పష్టం చేస్తున్నారు.

**అసలు ప్రశ్న ఏమిటి?..** ఎస్ఐఆర్ కొత్త ప్రక్రియ కాదు. ఎన్నికల జాబితాలను నవీకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అవసరమైన పరిపాలనా చర్య. అయితే ఆ ప్రక్రియ అమలు పద్ధతిపైనే ప్రజల విశ్వాసం ఆధారపడి ఉంటుంది. 2028 ఎన్నికలకు రెండేళ్ల ముందే భారీ స్థాయిలో ఓటర్ల రికార్డుల పరిశీలన చేపట్టడం, తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాలు, ఇతర రాష్ట్రాల్లో తలెత్తిన వివాదాల నేపథ్యం — ఇవన్నీ కలిసి అనుమానాలకు కారణమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటర్ల జాబితా ఎంత ముఖ్యమో, ఆ జాబితాపై ప్రజల నమ్మకం కూడా అంతే ముఖ్యమైనది. అందుకే ఎన్నికల సంఘం ప్రతి చర్యను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉంది.

### ప్రజలు చేయాల్సిందేమిటి?

ప్రజలు తమ ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించకూడదు. బూత్ స్థాయి అధికారులు వచ్చినప్పుడు సరైన వివరాలు అందించాలి. గుర్తింపు పత్రాలు, చిరునామా రుజువులు సిద్ధంగా ఉంచుకోవాలి. తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో నిరంతరం తనిఖీ చేసుకోవాలి. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలి.

### ప్రజాస్వామ్యానికి అసలు పరీక్ష

ఓటర్ల జాబితా ప్రక్షాళన అవసరమే. కానీ ఆ పేరుతో అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజలకు ఎలాంటి సందేహం తలెత్తకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా ఆరోపణలకే పరిమితం కాకుండా ప్రజల్లో అవగాహన పెంచాలి. తెలంగాణలో జూన్ 25 నుంచి ప్రారంభమవుతున్న ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కేవలం ఓటర్ల జాబితాను మాత్రమే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కూడా పరీక్షించబోతోంది. చివరికి గెలవాల్సింది ఏ రాజకీయ పార్టీ కాదు; గెలవాల్సింది రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల విశ్వాసం.

> ఎస్ఐఆర్ కొత్త ప్రక్రియ కాదు. ఎన్నికల జాబితాలను నవీకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అవసరమైన పరిపాలనా చర్య. అయితే ఆ ప్రక్రియ అమలు పద్ధతిపైనే ప్రజల విశ్వాసం ఆధారపడి ఉంటుంది. 2028 ఎన్నికలకు రెండేళ్ల ముందే భారీ స్థాయిలో ఓటర్ల రికార్డుల పరిశీలన చేపట్టడం, తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాలు, ఇతర రాష్ట్రాల్లో తలెత్తిన వివాదాల నేపథ్యం —— ఇవన్నీ కలిసి అనుమానాలకు కారణమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటర్ల జాబితా ఎంత ముఖ్యమో, ఆ జాబితాపై ప్రజల నమ్మకం కూడా అంతే ముఖ్యమైనది. అందుకే ఎన్నికల సంఘం ప్రతి చర్యను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉంది.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్
9010128884

# విద్యా సంక్షోభమా.. వ్యవస్థ వైఫల్యమా..?


మానవ మేధస్సుకు పదును పెట్టి, సత్ప్రవర్తనను నేర్పి, సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించే ఒక దివ్యమైన సాధనం విద్య. ఒకప్పుడు పాఠశాల విద్య అంటే కేవలం అక్షరాల గుర్తింపు మాత్రమే కాదు; విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, ఆలోచనా శక్తిని విశ్వవ్యాప్తం చేయడం, నిశిత విమర్శనాత్మక జ్ఞానాన్ని పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసానికి సుదృఢమైన పునాది వేయడం అనే మహోన్నతమైన, పవిత్రమైన భావన ఉట్టిపడేది. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే బోధకుడు కాదు, విద్యార్థి జీవితాన్ని సమున్నతంగా తీర్చిదిద్దే శిల్పిగా విరాజిల్లాడు. కానీ, నేటి ఆధునిక, ప్రపంచీకరణ యుగంలో మార్కెట్ శక్తుల ప్రవేశంతో విద్యా వ్యవస్థ తన ప్రాథమిక నైతిక అస్తిత్వాన్ని కోల్పోతూ ఆందోళనకరమైన రీతిలో వ్యాపారీకరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పాఠశాల విద్యా ప్రస్థానంలో అత్యంత కీలకమైన మైలురాయిగా భావించే పదో తరగతి (ఎస్ఎస్‌సీ) బోర్డు పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను పరిశీలిస్తే, సమకాలీన వ్యవస్థ ఎంతటి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందో స్పష్టమవుతుంది. మార్కుల వేట, ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలనే తాపత్రయం, కార్పొరేట్ విద్యాసంస్థల అహంకారపూరితమైన ర్యాంకుల పోటీల మధ్య అసలైన విద్యా ప్రమాణాలు నిలువునా బలైపోతున్నాయి. విద్యార్థుల హృదయాలలో జ్ఞాన తృష్ణను, జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం అంకెలు, శాతాల చుట్టూ తిరిగే ఒక కృత్రిమ ఫలితాల సంస్కృతిని రుద్దడం వల్ల, విద్య అనేది నిరంతర ఆనందదాయకమైన ప్రక్రియ కాస్తా, అత్యంత భయంకరమైన మానసిక బంధనంగా మారిపోతోంది. భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు ఒక కోటి యాభై లక్షల మంది విద్యార్థులు పదో తరగతి లేదా తత్సమాన బోర్డు పరీక్షల వేదికలపై తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి ప్రతి ఏడాది దాదాపు పది లక్షలకు పైగా బాల్యప్రాయపు విద్యార్థులు ఎస్ఎస్‌సీ పరీక్షల పీఠం ఎక్కుతున్నారు. అయితే ప్రతి ఏటా ఈ పరీక్షల ఫలితాలు వెలువడినప్పుడు సమాజంలో కనిపించే దృశ్యాలు అత్యంత విచిత్రంగా, దారుణంగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, పాఠశాల యాజమాన్యాలు తాము సాధించిన ఉత్తీర్ణత శాతాలనే ఒక గొప్ప విజయంగా, అట్టహాసంగా చాటుకుంటూ ప్రచార ఆర్భాటాల్లో మునిగిపోతున్నాయి. ఏ జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది, ఏ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డులకెక్కింది, ఎవరికి పదికి పది జీపీఏ గ్రేడింగ్ వచ్చింది అనే అంశాలే పత్రికల ముఖ్యాంశాలుగా, దృశ్య మాధ్యమాల చర్చలుగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తూ, ఈ సంఖ్యాపరమైన ఆరాటంలో అసలైన ప్రాథమిక ప్రశ్నలు పూర్తిగా అణచివేయబడుతున్నాయి. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు నిజంగా ఆయా సబ్జెక్టులలో ఎంత మేర ప్రాథమిక అవగాహనను,

> పునాది లోపించిన ఈ విద్యా విధానం దేశ మానవ వనరుల నాణ్యతను ఎంతగా దిగజారుస్తుందో చెప్పడానికి ఇదొక సజీవ సాక్ష్యం. పరీక్షల నిర్వహణను మరియు విద్యార్థుల భవిష్యత్తును పట్టిపీడిస్తున్న మరో ప్రధాన రుగ్మత 'మార్కుల దాహం'. ప్రస్తుతం అమలులో ఉన్న గ్రేడింగ్ విధానంలో 10 జీపీఏ సాధించడం, లేదా 600 మార్కులకు గానూ 600 మార్కులు సాధించాలనే అహేతుకమైన, కృత్రిమమైన లక్ష్యాలను విద్యార్థులపై రుద్దడం వల్ల సమాజంలో ఒక అనారోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. కేవలం అర మార్కు లేదా ఒక మార్కు తక్కువ వచ్చినా విద్యార్థులు తాము జీవితంలో సర్వస్వం కోల్పోయామనే తీవ్ర నైరాశ్యంలోకి, కుంగుబాటులోకి జారిపోతున్నారు. తల్లిదండ్రుల మితిమీరిన ఆశలు, ఉపాధ్యాయుల నిరంతర వేధింపులు, యాజమాన్యాల హెచ్చరికలు వారిని మానసికంగా జీవచ్ఛవాలుగా మార్చుతున్నాయి.




లోతైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారనే శోధన ఎక్కడా జరగడం లేదు. చదివిన అంశాన్ని నిత్యజీవితంలో అన్వయించుకునే సృజనాత్మక నైపుణ్యాలు వారిలో వికసించాయా, రేపటి సమాజంలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సరిపడా వివేకాన్ని వారు సంపాదించగలిగారా అనే మౌలిక ఆశయాలు ఈ శాతాల హోరులో కొట్టుకుపోతున్నాయి. ఈ ఉత్తీర్ణత శాతం పెంచాలనే అదృశ్య, నిరంకుశ ఒత్తిడి అటు ప్రభుత్వ పాఠశాలలపై, ఇటు ప్రైవేటు పాఠశాలలపై తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతోంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను విద్యార్థులకు క్షుణ్ణంగా, హృదయాలకు హత్తుకునేలా బోధించి వారిలో జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం పరీక్షా సన్నద్ధతకే సింహభాగం సమయాన్ని ధారపోస్తున్నారు. ఫలితంగా సిలబస్‌ను సంపూర్ణంగా బోధించకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చిపెట్టే ముఖ్యమైన ప్రశ్నలు, రెడీమేడ్ గెస్ పేపర్లు, ప్రశ్న బ్యాంకులు, నమూనా పత్రాల కంఠస్థీకరణకే పరిమితం చేస్తున్నారు. ఇది విద్యార్థుల్లోని ఆలోచనా శక్తిని చంపేసి, కేవలం తాత్కాలిక జ్ఞాపకశక్తి ఆధారిత క్షుద్ర విద్యను మాత్రమే ప్రోత్సహిస్తోంది. ఈ భయానకమైన పోటీ ప్రపంచంలో కొన్ని కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు తమ వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు, కొత్త అడ్మిషన్ల వేటకు విద్యార్థుల మార్కులను అంగడి సరుకులుగా వాడుకుంటున్నాయి. టాప్ ర్యాం కులను సాధించడమే లక్ష్యంగా, పదో తరగతి వయసులో ఉన్న పసివాళ్లపై అమానవీయమైన, అసాధారణమైన మానసిక ఒత్తిడిని నూరిపోస్తున్నాయి. తెల్లవారుజాము ఐదు గంటల నుంచే ప్రత్యేక తరగతులు, రాత్రి పది గంటల వరకు స్టడీ అవర్ల పేరిట విద్యార్థులను ఇనుప గదుల్లో బందీలను చేస్తున్నాయి. బాల్యానికి సహజసిద్ధమైన ఆటపాటలు, శారీరక శ్రమ, మానసిక వికాసానికి కనీస స్థానం కూడా లేకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు గుంజడమే ధ్యేయంగా సాగుతున్న ఈ యాంత్రిక విధానం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక వైకల్యానికి, నిరాశకు లోనవుతున్నారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ఏటా విడుదల చేస్తున్న నివేదికలు ఈ భయంకరమైన వాస్తవాన్ని కళ్లముందు ఉంచుతున్నాయి. పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక, తల్లిదండ్రుల మితిమీరిన అంచనాలను అందుకోలేక, ఆశించిన గ్రేడింగ్ రాదేమోననే తీవ్రమైన భయాందోళనలతో దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు ఆత్మహత్యల వంటి దారుణమైన నిర్ణయాలు తీసుకుని కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. మార్కుల కోసం ఆరాటపడే ఈ క్రూరమైన విద్యా వ్యవస్థ పసివాళ్ల బాల్యాన్ని బలితీసుకుంటున్న వైనం సమాజ విజ్ఞతకే ఒక పెద్ద సవాలుగా నిలుస్తోంది. ఉత్తీర్ణత శాతం కోసం సాగుతున్న ఈ అడ్డగోలు రేసు మరో ప్రమాదకరమైన, అనైతికమైన ధోరణికి దారితీస్తోంది. అదే పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగతంగా జరుగుతున్న అపసవ్యాలు, అవకతవకలు. కొన్ని పాఠశాలలు, విద్యాసంస్థలు, ఆఖరికి కొన్ని ప్రాంతాల్లోని విద్యాశాఖ యంత్రాంగాలు కూడా తమ పరిధిలోని ఫలితాలు మెరుగ్గా చూపించుకోవడానికి పరీక్షల నిర్వహణలో అవాంఛనీయమైన జోక్యానికి, అక్రమాలకు పాల్పడుతున్నాయనే నగ్నసత్యాలు నిరంతరం వెలుగుచూస్తూనే ఉన్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక శక్తుల ప్రయోజనాల కోసం సామూహిక కాపీయింగ్‌ను పరోక్షంగా ప్రోత్సహించడం, ఇన్విజిలేషన్ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించడం లేదా చూసీచూడనట్లు వ్యవహరించడం, విద్యార్థులకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమాధానాలు చేరవేయడం వంటి ఘటనలు తరచూ విద్యా వ్యవస్థ నైతికతను ప్రశ్నిస్తున్నాయి. ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత, పరీక్షా కేంద్రాల వెలుపల నుండి మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాలకే సమాధానాలు లోపలికి చేరవేయడం వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా పరీక్షల విశ్వసనీయతను నిలువునా దెబ్బ తీస్తున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో వివిధ రాష్ట్రాల్లో వెలుగుచూసిన సామూహిక కాపీయింగ్ ఉదంతాలు, ముఖ్యంగా పాఠశాల భవనాల కిటికీలు, గోడలు ఎక్కి మరీ బంధువులు విద్యార్థులకు కాపీ చీటీలను అందిస్తున్న అపరూప దృశ్యాలు అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. ఇటువంటి అక్రమాల ద్వారా, కాపీయింగ్ సాయంతో బోర్డు పరీక్షల గండం గట్టెక్కుతున్న విద్యార్థులు, భవిష్యత్తులో ఉన్నత విద్యా కోర్సులలోనూ, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలోనూ, అత్యంత పోటీతో కూడిన ఉపాధి రంగాలలోనూ తీవ్రమైన అసమర్థతను ప్రదర్శిస్తూ నిలువునా కుప్పకూలిపోతున్నారు. పునాది లోపించిన ఈ విద్యా విధానం దేశ మానవ వనరుల నాణ్యతను ఎంతగా దిగజారుస్తుందో చెప్పడానికి ఇదొక సజీవ సాక్ష్యం. పరీక్షల నిర్వహణను మరియు విద్యార్థుల భవిష్యత్తును పట్టిపీడిస్తున్న మరో ప్రధాన రుగ్మత 'మార్కుల దాహం'. ప్రస్తుతం అమలులో ఉన్న గ్రేడింగ్ విధానంలో 10 జీపీఏ సాధించడం, లేదా 600 మార్కులకు గానూ 600 మార్కులు సాధించాలనే అహేతుకమైన, కృత్రిమమైన లక్ష్యాలను విద్యార్థులపై రుద్దడం వల్ల సమాజంలో ఒక అనారోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. కేవలం అర మార్కు లేదా ఒక మార్కు తక్కువ వచ్చినా విద్యార్థులు తాము జీవితంలో సర్వస్వం కోల్పోయామనే తీవ్ర నైరాశ్యంలోకి, కుంగుబాటులోకి జారిపోతున్నారు. తల్లిదండ్రుల మితిమీరిన ఆశలు, ఉపాధ్యాయుల నిరంతర వేధింపులు, యాజమాన్యాల హెచ్చరికలు వారిని మానసికంగా జీవచ్ఛవాలుగా మార్చుతున్నాయి. విద్యాభ్యాసం అంటే కేవలం అంకెలను స్కోర్ చేయడం కాదు, అదొక నిరంతర పరిణామ ప్రక్రియ అనే మౌలిక సత్యం క్రమంగా మరుగున పడిపోతోంది. జాతీయ విద్యా విధానం-2020 (NEP) ఈ తీవ్రమైన ప్రమాదాన్ని ముందే గుర్తించి, విద్యను కేవలం పరీక్షల ఆధారితంగా కాకుండా, విద్యార్థుల సమగ్ర మేధో, శారీరక, మానసిక మూల్యాంకన విధానంతో (360 డిగ్రీల అసెస్‌మెంట్) అంచనా వేయాలని బలంగా సూచించింది. విద్యార్థులలో దాగి ఉన్న విమర్శనాత్మక ఆలోచన, సహజ సిద్ధమైన నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలను గుర్తించడమే విద్యా పరమావధిగా ఉండాలని స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయి ఆచరణలో మాత్రం ఇంకా పాత మార్కుల ఆధారిత వికృత క్రీడే కొనసాగుతోంది. పాఠశాలల పనితీరును, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని నేటికీ కేవలం ఆయా తరగతుల్లో సాధించిన పాస్ పర్సంటేజీలతోనే ముడిపెట్టి వేతనాలు, ప్రమోషన్లను అంచనా వేస్తుండటం వల్ల, వ్యవస్థలో ఆశించిన గుణాత్మక మార్పు రావడం లేదు. నిజమైన విద్యా ప్రమాణాల పునరుద్ధరణ జరగాలంటే, వంద శాతం ఫలితాల భ్రమల నుండి విద్యాశాఖ, సమాజం మొదట బయటకు రావాలి. విద్యార్థి ఆయా తరగతులకు నిర్దేశించిన కనీస అభ్యాస సామర్థ్యాలను (లెర్నింగ్ అవుట్‌కమ్స్) సాధించాడా లేదా అన్నదే ఏకైక ప్రామాణికంగా మారాలి. చదివిన విషయాన్ని సొంతంగా విశ్లేషించి స్పష్టంగా రాయగలగడం, గణిత సమస్యలను భయం లేకుండా సాధించగలగడం, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవడం వంటి అంశాలే నిజమైన ప్రగతికి సంకేతాలు. పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత, కట్టుదిట్టమైన పర్యవేక్షణ అత్యంత ఆవశ్యకం. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీటీవీ కెమెరాల నిఘా, డిజిటల్ పద్ధతిలో ప్రశ్నాపత్రాల పంపిణీ, బయోమెట్రిక్ హాజరు, మూల్యాంకన ప్రక్రియలో కఠినమైన కోడింగ్ విధానం వంటి సాంకేతిక సంస్కరణలను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా అక్రమాలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయవచ్చు. అదే సమయంలో, ఉపాధ్యాయులపై కేవలం ఫలితాలు తేవాలనే కక్షసాధింపు ఒత్తిళ్లను ఆపి, వారి బోధనా నాణ్యత ఆధారంగా వారికి గౌరవం దక్కాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పక్క పిల్లలతో పోల్చి చూసే మానసిక జాడ్యాన్ని వదిలించుకోవాలి. ప్రతి బిడ్డలోనూ ఒక అపురూపమైన, ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. సమాజంలో గౌరవంగా బతకడానికి అందరికీ వందకు వంద మార్కులు రానవసరం లేదు. వారి ఆసక్తులు, సృజనాత్మక నైపుణ్యాలను గుర్తించి స్వేచ్ఛగా ప్రోత్సహించినప్పుడే నైతిక విలువలతో కూడిన నిజాయితీ గల పౌరులు తయారవుతారు. పరీక్షలు అనేవి విద్యార్థి మేధస్సుకు ఒక ఆరోగ్యకరమైన కొలమానం కావాలి తప్ప, విద్యను పరీక్షల గదికే పరిమితం చేసే ఒక నిర్బంధ సాధనంగా మారకూడదు. ఉత్తీర్ణత శాతం కన్నా విద్యా నాణ్యతకు, మానవత్వానికి ప్రాధాన్యమిచ్చే ఒక నూతన సంస్కృతి ఏర్పడినప్పుడే విద్యా రంగం సరైన గాడిలో పడి, దేశ భవిష్యత్తుకు నిజమైన భరోసా లభిస్తుంది.

> ప్రభుత్వాలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, పాఠశాల యాజమాన్యాలు తాము సాధించిన ఉత్తీర్ణత శాతాలనే ఒక గొప్ప విజయంగా, అట్టహాసంగా చాటుకుంటూ ప్రచార ఆర్భాటాల్లో మునిగిపోతున్నాయి. ఏ జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది, ఏ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డులకెక్కింది, ఎవరికి పదికి పది జీపీఏ గ్రేడింగ్ వచ్చింది అనే అంశాలే పత్రికల ముఖ్యాంశాలుగా, దృశ్య మాధ్యమాల చర్చలుగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తూ, ఈ సంఖ్యాపరమైన ఆరాటంలో అసలైన ప్రాథమిక ప్రశ్నలు పూర్తిగా అణచివేయబడుతున్నాయి.



సంగనబట్ల
9440595494

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# జాతీయం-అంతర్జాతీయం





## పశ్చిమ బెంగాల్‌లో కూలిన వేర్‌హౌస్

- శిథిలాల్లో చిక్కుకున్న వర్కర్లు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

**కలకత్తా, జూన్ 24 ,(ఎ.ఎం.ఎస్):**
పశ్చిమ బెంగాల్‌లో నిర్మాణంలో ఉన్న వేర్‌హౌస్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో డజన్ల కొద్దీ వర్కర్లు శిథిలాల కింద చిక్కుకుపోయారు. కోల్‌కతాలోని తరతలలో బుధవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దాదాపు 50 మందిదాకా వర్కర్లు బుధవారం వేర్‌హౌస్‌లో పని చేస్తున్నారు. మధ్యాహ్నం ఉన్నట్టుండి వేర్‌హౌస్ కుప్పకూలిపోయింది. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసుకువచ్చే ప్రయత్నాలు మొదలెట్టారు. ఇక, సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సిబ్బంది, సైనికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు 7 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. గ్యాస్ కట్టర్ల సాయంతో వేర్‌హౌస్ బీమ్‌లను కట్ చేసి మిగిలిన వారిని బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు..



- ముగ్గురు గల్లంతు


**ఈటానగర్, జూన్ 24:**
అరుణాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బుధవారం నాటికి తీవ్ర రూపం దాల్చాయి. కేయీ పన్యోర్ జిల్లాలో వరద ఉధృతికి ఇళ్లు దెబ్బతినడమే కాకుండా, ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. యాజాలి పరిధిలోని పూసా సమీపంలో గల నీపో్క ప్రాజెక్ట్ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న ఒక రిటైనింగ్ వాల్ కుప్పకూలడంతో వరద నీరు నివాస ప్రాంతాల్లోకి దూసుకెళ్లింది. కనీసం 18 ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపింది.

## తమిళనాడులో మేనమామ ఉంగరం...

- కొత్త పథకానికి శ్రీకారం చుట్టిన విజయ్ ప్రభుత్వం
- రూ.755 కోట్లతో ప్రారంభం

**చెన్నై, జూన్ 23(ఎ.ఎం.ఎస్):**
తమిళనాడు ముఖ్యమంత్రి చంద్రశేఖర్ జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం మరో ప్రజాకర్షక పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే ప్రతి బిడ్డకూ ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని ఉచితంగా అందజేసే 'తై మామన్ తంగ మోదిరమ్ తిట్టమ్' (మేనమామ బంగారు ఉంగరం పథకం) అనే సరికొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ పథకం మంగళవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. తమిళ సంస్కృతిలో పుట్టిన పిల్లాడికి మేనమామ బంగారు ఉంగరం తొడగడం ఒక పవిత్రమైన సంప్రదాయంగా భావిస్తారు. ఈ సెంటిమెంట్‌ను గౌరవిస్తూ.. ఆ బిడ్డకు మేనమామ స్థానంలో ప్రభుత్వమే నిలబడి ఈ ఉంగరాన్ని బహుమతిగా ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను టీవీకే ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఏటా రూ. 755.83 కోట్లను ఖర్చు చేయనుంది.

ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్.. పాలనలో తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్‌తో పాటు తాజాగా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గర్భిణీలు ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్యను పెంచడం, కాన్పు సమయంలో తల్లీబిడ్డల సంరక్షణను మెరుగుపరచడం ఈ పథకం వెనుక ఉన్న మరో ముఖ్య ఉద్దేశం.



తమిళ సంస్కృతిలో పుట్టిన పిల్లాడికి మేనమామ బంగారు ఉంగరం తొడగడం ఒక పవిత్రమైన సంప్రదాయంగా భావిస్తారు. ఈ సెంటిమెంట్‌ను గౌరవిస్తూ.. ఆ బిడ్డకు మేనమామ స్థానంలో ప్రభుత్వమే నిలబడి ఈ ఉంగరాన్ని బహుమతిగా ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను టీవీకే ప్రభుత్వం విడుదల చేసింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల పెంపుతో పాటు ఇటువంటి వినూత్న పథకాలను అమలుచేయడం వల్ల ప్రసవాల శాతం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కాగా, గతంలో దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ప్రారంభించిన 'అమ్మ కిట్' వంటి పథకాలు మహిళల్లో మంచి ఆదరణ తీసుకొచ్చాయి. అదే తరహాలోనే సీఎం విజయ్ ప్రవేశపెట్టిన ఈ 'బంగారు ఉంగరం పథకం' తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పథకం ద్వారా క్షేత్రస్థాయిలో పేదలకు భారీ ఊరట లభించడమే కాకుండా.. రాజకీయంగా ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో విజయ్‌కు మరింత ఆదరణ పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇంత నిస్సిగ్గుగా ఇంటర్వ్యూలా..?

- మంత్రి పదవికి రాజీనామా చేయకపోవటం దారుణం
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై ఖర్గే ఆగ్రహం



**న్యూఢిల్లీ, జూన్ 24 ,(ఎ.ఎం.ఎస్):**
కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పై కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గే ఫైర్ అయ్యారు. నీట్ పేపర్ లీక్ కారణంగా వేలమంది విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని, 20మందికిపైగా విద్యార్థులు ఆత్మహత్యకు చేసుకున్నారని, అయినా కానీ మంత్రిపదవికి రాజీనామా చేయకుండా నిస్సిగ్గుగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ పాలనలో మొత్తం 90పైగా పలు పేపర్లు లీకేజ్ అయినట్లు ఆయన ఎక్స్ వేదికగా తెలియజేశారు. పేపర్ లీకేజ్ తో విద్యార్థులు భవిష్యత్ పాటు తల్లిదండ్రులు మానసికంగా కృంగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో అవినీతిని ప్రశ్నస్తే దేశ ద్రోహులంటూ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలిచిన వారిని స్వయంగా ప్రధాని మోదీ పార్లమెంటు సాక్షిగా 'ఆందోళన జీవులు' మరియు 'పరాన్నజీవులు' అని అవమానకరంగా సంబోధించడాన్ని దేశం మర్చిపోలేదు. ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఎవరినైనా దేశద్రోహిగా ముద్ర వేస్తున్నారు. 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) దేశవ్యాప్తంగా గట్టిగా వినిపిస్తుంది. మంత్రి ప్రధాన్ రాజీనామా చేయక తప్పదు," అని ఆయన అన్నారు. అంతకు ముందు, ఒక ఇంటర్వ్యూలో ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. తన రాజీనామా కోరుతూ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనలు "విధ్వంసక శక్తుల 'బిటీమ్' చర్యలు" అని ప్రధాన్ వ్యాఖ్యానించారు. ఆ నిరసనకారుల గురించి ప్రస్తావిస్తూ, వారు విధ్వంసక శక్తుల 'బిటీమ్' అని, ప్రజాస్వామ్యంలో తిరస్కరణకు గురైన వారు వేషం మార్చుకుని వచ్చి వ్యవస్థను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని, దేశాన్ని విభజించాలనుకునే వారి కోసం నినాదాలు చేస్తున్నారని ఆయన అన్నారు.

## సీయూఈటీ ఫలితాల్లో దేవినాకు తొలి ర్యాంకు

- ఆమె సక్సెస్ జర్నీ అద్భుతం
- తన కష్టానికి ఫలితం దక్కిందంటూ వెల్లడి




**ఢిల్లీ, జూన్ 24(ఎ.ఎం.ఎస్):**
దేశ వ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన సీయూఈటీ పరీక్షా ఫలితాల్లో బీజేపీ ఎమ్మెల్యే కైలాశ్ గహ్లోత్ కుమార్తె దేవినా జాతీయ స్థాయిలో తొలి ర్యాంకు సాధించారు. తాజాగా వెల్లడైన ఫలితాల్లో ఆమె టాప్‌స్కోరర్‌గా నిలిచారు. మంచి ర్యాంకు వస్తుందని అనుకున్నానని.. కానీ తొలిస్థానం దక్కించుకోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్' ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ జాతీయ స్థాయి పోటీ పరీక్షలో ఢిల్లీకి చెందిన విద్యార్థిని దేవినా గహ్లోత్ అసాధారణ ప్రతిభ కనబరిచి, ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్‌తో టాప్‌స్కోరర్‌గా నిలిచారు. దేవినా గహ్లోత్.. ఢిల్లీ మాజీ రవాణా, పర్యావరణ శాఖ మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే కైలాశ్ గహ్లోత్ కుమార్తె. జాతీయ స్థాయిలో అగ్రస్థానం దక్కించుకున్న దేవినా సక్సెస్ జర్నీ, ఆమె చదువుకున్న తీరు ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది.

జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంపై దేవినా గహ్లోత్ మీడియా ముందు తన ఆనందాన్ని పంచుకున్నారు. "మంచి మార్కులు, ఉత్తమ ర్యాంకు వస్తుందని ఆశించాను. కానీ ఏకంగా దేశంలోనే నంబర్ వన్ స్థానం దక్కుతుందని అస్సలు ఊహించలేదు. ఫలితాలు చూశాక నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. ఎక్కడైనా తప్పు చూశానా అని నా రోల్ నంబర్‌ను మళ్లీ మళ్లీ సరిచూసుకున్నాను. ఇదొక కలలా ఉంది" అని దేవినా పేర్కొన్నారు. తన భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన పరీక్ష కావడంతో ప్రిపరేషన్ సమయంలో కొంత ఒత్తిడికి గురైనప్పటికీ.. తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం, ధైర్యం వల్లే తాను ఈ మైలురాయిని అందుకోగలిగానని ఆమె కృతజ్ఞత భావాన్ని చాటుకున్నారు. జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిపిన తన ప్రిపరేషన్ స్ట్రాటజీని దేవినా వివరించారు. బోర్డు పరీక్షలు ముగిసిన వెంటనే ఏమాత్రం సమయం వృథా చేయకుండా సీయూఈటీ ప్రిపరేషన్‌ను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. "రోజుకు ఒకే సబ్జెక్టుకు పరిమితం కాకుండా.. ప్రతి రోజూ అన్ని సబ్జెక్టులను క్రమబద్ధంగా చదివాను. కొత్త అంశాలను నేర్చుకోవడంతో పాటు చదివిన వాటిని తరచూ రివిజన్ చేయడం నాకు బాగా ప్లస్ అయింది. అలాగే మునుపటి సంవత్సరాల మాక్ పేపర్లను ఎక్కువగా సాధన చేయడం వల్ల పరీక్షలో సమయాన్ని ఎలా మేనేజ్ చేయాలో అవగాహన వచ్చింది" అని దేవినా స్పష్టం చేశారు.

రాజకీయాలు, జర్నలిజం, సాహిత్యంపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని.. ప్రజలకు సేవ చేయడంలో తన తండ్రి కైలాశ్ గహ్లోత్ పడుతున్న శ్రమను చూసి తనకు కూడా పాలిటిక్స్ వైపు వెళ్లాలనే ఇష్టం ఏర్పడిందని ఆమె తన భవిష్యత్తు ప్రణాళికలను పంచుకున్నారు. కుమార్తె సాధించిన ఘన విజయంపై ఎమ్మెల్యే కైలాశ్ గహ్లోత్ స్పందిస్తూ.. ఇది పూర్తిగా దేవినా కష్టపడే తత్వానికి, పట్టుదలకు దక్కిన ఫలితమని హర్షం వ్యక్తం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నేతృత్వంలో ఈ ఏడాది సీయూఈటీ యూజీ 2026 పరీక్షలను మే 11వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు, అలాగే జూన్ 6, 7 తేదీల్లో మొత్తం 19 రోజుల పాటు అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 35 షిఫ్టుల్లో లక్షలాది మంది విద్యార్థులు ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు హాజరు కాగా.. మంగళవారం సాయంత్రం అధికారికంగా ఫలితాలను వెల్లడించారు.

## ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు ప్రారంభిద్దాం..

- రష్యా అధ్యక్షుడు పుతిన్ నిర్ణయం



**మాస్కో, జూన్ 24:**
రష్యాఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌తో శాంతి చర్చలను పునఃప్రారంభించడానికి తాను సిద్ధంగా ఉన్నానని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. పాశ్చాత్య దేశాలు ఉద్దేశపూర్వకంగానే ఉద్రిక్తతలను పెంచుతున్నాయని విమర్శించారు. అయితే తమమధ్య 2022, 2025ల్లో కుదిరిన ఒప్పందాల ఆధారంగానే చర్చలు జరగాలని కోరారు. ఆ మేరకే శాంతిచర్చలను ముందుకుతీసుకెళ్తామని పుతిన్ వెల్లడించారు. ఉక్రెయిన్ రష్యా పౌరులపై దాడులు జరుపుతున్న నేపథ్యంలో ప్రత్యక్ష చర్చలు సాధ్యం కావని వివరించారు.

## భరత్ భూషణ్ తివారీ కుటుంబానికి ప్రశాంత్ కిశోర్ పరామర్శ

బీహార్ : లోని భోజ్‌పూర్ జిల్లా, బిలౌతి గ్రామానికి చెందిన 28 ఏళ్ల విద్యార్థి, భరత్ భూషణ్ తివారీ, ఇటీవల జూన్ 17న పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఈ ఎన్‌కౌంటర్ పై బీహార్ వ్యాప్తంగా విమర్శలు వెలువెత్తుతున్నాయి. రోజురోజుకు తివారి ఎన్ కౌంటర్‌ను వ్యతిరేకిస్తు ఆందోళనలు మిన్నంటాయి. తాజాగా జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కుమార్ భరత్ భూషన్ తివారి కుటుంబాన్ని కలిశారు. స్వయంగా బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. భరత్ కుమార్ ఎన్ కౌంటర్ పై జ్యూడిషియల్ ఎంక్వైరీ చేపట్టాలని, ఆకారణంగా చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక అందర్ని జోక్యం ఉందని, పారదర్శకంగా విచారణ చేపట్టి అసలు నేరస్తులను తొందరగా శిక్షించాలన్నారు. ఇదిలా ఉండగా, భరత్ భూషణ్ తివారీ ఎన్‌కౌంటర్ ఆరోపణలపై జగదీష్‌పూర్ డీఎస్పీ, షాహ్‌పూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO), ఇతర సహాయక పోలీసు సిబ్బందిపై బీహార్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తివారీ తల్లి భోజ్‌పూర్ ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో, షాహ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది.

## గ్రీన్ కార్డు హోల్డర్లకు అమెరికా షాక్..

- ట్రంప్ అధికారాలను సమర్థించిన సుప్రీంకోర్టు
- వలసదారుల్లో తీవ్ర ఆందోళన



**న్యూయార్క్, జూన్ 24:**
అమెరికాలో నివసిస్తున్న లక్షలాది మంది వలసదారులకు, ముఖ్యంగా గ్రీన్‌కార్డు కలిగి ఉండి శాశ్వత నివాస హోదా పొందిన వారికి యూఎస్ సుప్రీం కోర్టు కోలుకోలేని షాక్ ఇచ్చింది. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న గ్రీన్‌కార్డు హోల్డర్లను దేశం నుంచి సులభంగా బహిష్కరించే విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ అధికారాలను సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ నిర్ణయం వలసదారుల హక్కులను తీవ్రంగా ప్రభావితం చేయనుండగా.. అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుప్రీం కోర్టు ధర్మాసనం 6, 3 మెజారిటీతో ఈ సంచలన తీర్పును ఇచ్చింది. దీని ప్రకారం.. నైతిక దుష్ప్రవర్తన, నకిలీ వ్యాపారాలు లేదా ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు కేవలం ఆరోపణలు, పెండింగ్ కేసులు ఉన్న గ్రీన్‌కార్డు హోల్డర్లు విదేశాలకు వెళ్లి తిరిగి అమెరికాలోకి ప్రవేశించేటప్పుడు బోర్డర్ ఏజెంట్లు వారిని అడ్డుకోవచ్చు. దేశంలోకి నేరుగా ప్రవేశం కల్పించకుండా 'ఇమ్మిగ్రేషన్ పెరోల్' కిందకు మార్చి, వారి గ్రీన్‌కార్డులను నిలిపివేసే అధికారం అధికారులకు లభించింది.

గతంలో సరిహద్దు వద్దే గ్రీన్ కార్డును ప్రశ్నించడానికి పక్కా ఆధారాలు కావాలని లోయర్ కోర్టులు చెప్పగా.. సుప్రీం కోర్టు ఆ నిబంధనను కొట్టేసింది. నేరం జరిగి ఉంటుందని నమ్మడానికి బలమైన కారణం ఉంటే చాలని జస్టిస్ క్లారెన్స్ థామస్ స్పష్టం చేశారు. దీనిపై లిబరల్ జడ్జి కేతన్జీ బ్రౌన్ జాక్సన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కోర్టు ప్రభుత్వానికి ఒక అపరిమితమైన 'బ్లాంక్ చెక్' ఇచ్చిందని, ఇది వలసదారులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చైనా జాతీయుడైన మక్ చోయ్ లూ కేసు సందర్భంగానే ఈ తీర్పు వచ్చింది. 2007లో గ్రీన్‌కార్డు పొందిన మక్ చోయ్‌పై 2012లో న్యూజెర్సీలో నకిలీ ట్రేడ్‌మార్క్ దుస్తుల అమ్మకాలకు సంబంధించిన క్రిమినల్ అభియోగాలు నమోదు అయ్యాయి. ఆ కేసు కోర్టులో ఉండగానే అతడు చైనాకు వెళ్లి.. జూన్ 2012లో న్యూయార్క్ ఎయిర్‌పోర్టు ద్వారా అమెరికాకు తిరిగి వచ్చాడు. అతనిపై పెండింగ్ కేసులు ఉన్నందున ఎయిర్‌పోర్ట్ అధికారులు అతనికి సాధారణ ప్రవేశాన్ని నిరాకరించి, కఠిన షరతులతో కూడిన పెరోల్‌పై అనుమతించారు.

ఆ తర్వాత కోర్టులో మక్ చోయ్ తన తప్పును అంగీకరించడంతో అతనికి దేశ బహిష్కరణ ఆదేశాలు జారీ అయ్యాయి. తాను చేసిన తప్పు నైతిక దుష్ప్రవర్తన కిందికి రాదని, దాని వల్ల కాకముందే బోర్డర్ వద్ద తనను అడ్డుకోవడం చట్టవిరుద్ధమని అతడు కోర్టును ఆశ్రయించాడు. కానీ తాజాగా సుప్రీం కోర్టులో అతనికి ఈ జాబితాలో చేరింది.

## పెంటగాన్‌పై అలీబాబా గ్రూప్ కేసు



- చైనా ఆర్మీకి మద్దతు ఇస్తున్నందుకే..
- కాలిఫోర్నియా కోర్టులో పిటిషన్

**శాన్‌జోస్, జూన్ 24:**
చైనా దిగ్గజ ఈ కామర్స్ సంస్థ అలీబాబా గ్రూప్ అమెరికా రక్షణ శాఖ పెంటగాన్‌పై కోర్టులో కేసు వేసింది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకు మద్దతు ఇస్తున్న జాబితా నుంచి తమ పేరును తొలగించాలంటూ కోర్టు మెట్లెక్కింది. పెంటగాన్ ఎలాంటి ఆధారాలు లేకుండానే తమను చైనా సైన్యానికి మద్దతుదారులుగా పేర్కొంది అంటూ కాలిఫోర్నియాలోని శాన్‌జోస్ ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జూన్ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ అలీబాబాతో పాటు చైనాకు చెందిన పలు ప్రముఖ కంపెనీలను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకు మద్దతు ఇస్తున్న జాబితాతో చేర్చింది. వాటిలో బైడూ, బీవైడీ, చాంగ్‌సిన్ మెమరీ టెక్నాలజీస్, యాంగ్జీ మెమెరీ టెక్నాలజీస్, యూనిట్రీ రోబోటిక్స్ వంటి సంస్థలు ఉన్నాయి. చైనా సోషల్ మీడియా, గేమింగ్ దిగ్గజం టెన్సెంట్ కూడా గతేడాది ఈ జాబితాలో చేరింది.

అయితే, తమకు చైనా సైన్యంతో ఎలాంటి సంబంధం లేదని అలీబాబా పెంటగాన్‌తో ఫిబ్రవరి నుంచే చర్చలు జరిపింది. అందుకు కావాల్సిన పత్రాలు, వివరణలు కూడా సమర్పించింది. అయినప్పటికీ రక్షణ శాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆలీబాబా ఆరోపించింది. తీరా చూస్తే జూన్ మొదట్లో తమ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టిందంటూ పిటిషన్‌లో పేర్కొంది. అలీబాబాను బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్టే గతంలో షియోమీ, అడ్వాన్స్డ్ మైక్రో ఫ్యాబ్రికేషన్ ఎక్విప్‌మెంట్ వంటి చైనా సంస్థలు పెంటగాన్‌పై కేసులు వేసి తమ పేర్లను బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించుకున్నాయి. బ్లాక్ లిస్ట్‌లో చేరడం వల్ల ప్రస్తుతానికి చట్టపరమైన ఆంక్షలు లేకపోయినా.. అమెరికా సైన్యంతో ఒప్పందాలు, పరిశోధన నిధులు పొందే అవకాశాలు దెబ్బతింటాయి. అలాగే అమెరికా పెట్టుబడిదారులకు కూడా ఇదో హెచ్చరికగా మారుతుంది. 2025 డిఫెన్స్ ఆథరైజేషన్ చట్టం ప్రకారం బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న చైనా కంపెనీలకు మద్దతుగా ఒప్పందాలు చేసుకోకూడదు. ఈ నిబంధన జూన్ 30 నుంచి అమల్లోకి రానుంది. ఈ కామర్స్ సంస్థగా ప్రారంభమైన అలీబాబా ప్రస్తుతం ఏఐ రంగంలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఈ కంపెనీ డెవలప్ చేసిన ఏఐ మోడల్స్ చైనాలో ప్రముఖ గుర్తింపు పొందాయి.

## రికార్డు బద్దలు కొట్టిన రష్యా-ఉక్రెయిన్ వార్

- రంగంలోకి విద్మాలు.. ప్రపంచవ్యాప్తంగా చర్చ



**మాస్కో, జూన్ 24:**
ఫిబ్రవరి 2022లో ప్రారంభమైన ఉక్రెయిన్ రష్యా యుద్ధం మొదటి ప్రపంచ యుద్ధం రికార్డును బద్దలు కొట్టింది. ఈ యుద్ధం మొదలైన కొత్తలో రష్యా ఆక్రమిత ప్రాంతాలలోని ఉక్రెయిన్ ప్రతిఘటన బహిరంగంగా ఉండేది. ఉక్రెయిన్‌కు చెందిన ఓ వృద్ధురాలు రష్యా పారాట్రూపర్ చేతిలో సన్‌ఫ్లవర్ సీడ్స్ పెట్టి "నువ్వు చనిపోయాక ఇక్కడ పొద్దుతిరుగు పువ్వులు మొలుస్తాయి" అని చెబుతున్న వీడియో అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నాటి నుంచి ఇప్పటికి వరకు విషయాలు మారాయి. ఇప్పుడు ఆ ప్రతిఘటన నిశ్శబ్దం ప్రణాళికలోకి మారింది.

ఉక్రెయిన్‌లో చొరబడిన రష్యా సైనికుడికి ఈ నిశ్శబ్ద ప్రతిఘటన తాలూకు రుచి మొదటిసారి తెలిసొచ్చింది. యుద్ధ విశేషాల పట్ల ఆసక్తి గల ఉక్రెయిన్‌కు చెందిన ఒంటరి గృహిణితో తాను క్లోజ్‌గా ఉంటున్నానని అతడు గత కొన్ని నెలలు నమ్మాడు. వాళ్లేదో ముందునుంచి ప్రేమికుల్లా రోజువారీ విషయాలను పంచుకునేవారు. ఒకరోజు అతడు ఎక్కడ ఉన్నాడో చూడాలని ఉందని ఆమె కోరడంతో తన లొకేషన్ ఫోటో పంపాడు. ఆ ఫోటో బ్యాక్‌గ్రౌండ్‌లో చాలా చిన్నగా వారి సైనిక స్థావరం మ్యాప్ కనిపించింది. వాస్తవానికి అక్కడ ఆ మహిళ అసలు లేదు! ది అట్లాంటిక్ నివేదిక ప్రకారం.. ఆ సోషల్ మీడియా ఖాతాను నడిపేది ఉక్రెయిన్ సైనిక నిఘా విభాగానికి చెందిన ఒక పురుష అధికారి. ఆ ఫోటో అందిన కొద్దిసేపటికే రష్యా సైనిక స్థావరంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసింది. గత నాలుగేళ్లలో ఉక్రెయిన్ యుద్ధ వ్యూహాలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు వాట్సాప్ గ్రూపులు, ఎన్‌క్రిప్టెడ్ మెసేజ్‌లతోనే యుద్ధాన్ని సాగిస్తోంది. చిన్న చిన్న వివరాలను సేకరించి, వాటిని లొకేషన్ కోఆర్డినేట్స్‌గా మార్చి, ఆ వెంటనే డ్రోన్ దాడులు జరపడం ఇప్పుడు కీవ్ ప్రధాన వ్యూహం. ఈ వ్యూహాల వెనుక మహిళలు లేదా వారిలా నటిస్తున్న పురుషులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఉక్రెయిన్ సైనిక కమాండర్లు తమ మహిళా ఏజెంట్ల గురించి మాట్లాడేటప్పుడు తరుచూ ఒక 'విద్మా' అనే పదం వాడుతుంటారు. ఉక్రేనియన్ జానపద కథల నుంచి వచ్చిన ఈ పదానికి 'మంత్రగత్తె' లేదా 'మాయావిని' అని అర్థం. ఎవరికీ తెలియని రహస్య జ్ఞానం తెలిసిన స్త్రీలను 'విద్మా' అని పిలుస్తారు. ది అట్లాంటిక్‌తో ఉక్రెయిన్ మాజీ ఎంపీ లెస్సియా ఒరోబెట్స్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌లో ఇలాంటి మహిళలను వారి తెలివితేటల కోసం గౌరవిస్తారు, పాతకాలంలా మంత్రగత్తెలుగా భావించి తగులబెట్టరని అన్నారు. వీళ్లు ప్రతిరోజూ ఉదయం రష్యా చెక్‌పోస్టుల నుంచి సాదాసీదాగా కూరగాయల బ్యాగులతో వెళ్తుంటారు.

మారియుపోల్ నుంచి తప్పించుకుని, ప్రస్తుతం రహస్యంగా సాగుతున్న ప్రతిఘటన నెట్‌వర్క్‌ను నడుపుతున్న పెట్రో ఆంద్రియుషెంకో మాట్లాడుతూ.. ఈ నెట్‌వర్క్‌లో మహిళలు ఎందుకు కీలకమో వివరించారు. 'పురుషులు వెళ్లలేని చోట్లకు వెళ్లగలరు, పురుషులు చేయలేని పనులను వారు చేయగలరు. అంతేకాదు, శత్రువుల విషయంలో వారు చాలా నిర్దయాత్మకంగా వ్యవహరిస్తారు" అని ఆయన చెప్పారు. రష్యా దండయాత్రకు ముందు ఖేర్సాన్ సమీపంలో ఒక క్లినిక్‌లో 'రొక్సానా' (పేరు మార్చారు) అనే మహిళ పనిచేసేది. రష్యా దళాలు ఆక్రమణలోకి వచ్చిన తర్వాత వారి కింద పనిచేయడానికి ఇష్టంలేక ఆమె అక్కడి నుంచి పారిపోయింది. ఈ క్రమంలో ఆమె 33 రష్యా చెక్‌పోస్టులను దాటాల్సి వచ్చింది. దారిపొడవునా శవాలు, ముఖ్యంగా అత్యాచారాలకు గురైన మహిళల మృతదేహాలు ఆమెకు కనిపించాయి. ఒక చెక్‌పోస్ట్ వద్ద రష్యా సైనికులు ఆమె వాహనంపై కాల్పులు జరపడంతో తోటి ప్రయాణికుడికి గాయాలయ్యాయి.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అంగన్వాడీ కేంద్రం, పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 24:**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తెట్టేకుంట తండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం సందర్శించి అక్కడి విద్యా, పోషకాహార కార్యక్రమాలు, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న విద్యాబోధన, పోషకాహార సేవల అమలు తీరును పరిశీలించిన కలెక్టర్, పిల్లల హాజరు శాతం, విద్యా ప్రమాణాలు, అంగన్వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలని, కేంద్రాలు, పాఠశాలల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీపీఎస్ తెట్టేకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిధిలావస్థలో ఉండటాన్ని గమనించిన కలెక్టర్, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఆర్డీవో సుమ, రాయపర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 2బీహెచ్‌కే ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**రాయపర్తి జూన్ 24 (వుదయం ప్రతినిధి):**

మండలంగన్నారం, కాట్రపల్లి గ్రామంలోని 2బీహెచ్‌కే గృహాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల నిర్మాణ స్థితి, మౌలిక వసతులు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2బీహెచ్‌కే ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించాలని, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో రాంరెడ్డిని ఆదేశించారు.ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హుల జాబితాను రూపొందించి, నిజమైన నిరుపేదలకు గృహాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, వరంగల్ ఆర్డీవో సుమ, రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్,ఆర్ఐ చంద్రమోహన్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి గిరిజన గ్రామాల్లో వైద్య సేవల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

**గిరిజనులకు నాణ్యమైన ఆరోగ్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



**భద్రాచలం, జూన్ 24, వుదయం ప్రతినిధి:**

ఆదివాసి గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా ఐటిడిఏలు, వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ భవనంలో నిర్వహించిన ఒకరోజు రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్. చోంగ్థు తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ఐటిడిఏల పరిధిలో గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో సాధారణ జ్వరాలు, వైరల్ వ్యాధులు మాత్రమే కాకుండా క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, పోషకాహార లోపాలు వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక అలవెన్సులు, ప్రోత్సాహకాలు, కార్పస్ ఫండ్ వంటి సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఎక్కువకాలం గిరిజన ప్రాంతాల్లో సేవలందించేలా ప్రోత్సహించే చర్యలు చేపడతామని చెప్పారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు చేరేలా మొబైల్ మెడికల్ యూనిట్లు, టెలిమెడిసిన్ సేవలు, ఆరోగ్య శిబిరాలను మరింత విస్తరించాలని మంత్రి సూచించారు.

గర్భిణులు, బాలింత లు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక ఆరోగ్య సేవలు అందించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా భద్రా చలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని, అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సీలు) సిబ్బంది లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. కొత్త పిహెచ్‌సీల నిర్మాణం, ఉన్న కేంద్రాల్లో మౌలిక వసతుల మెరుగుదల, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, మందుల లభ్యత కోసం దాదాపు రూ.20 కోట్ల నిధులు అవసరమని తెలిపారు.

## 'ఒలింపిక్ డే రన్'.. క్రీడా స్టేడియానికి రూ.4 కోట్లు మంజూరు: మంత్రి సీతక్క



**ములుగు, జూన్ 24 (వుదయం ప్రతినిధి) :**

క్రీడా రంగంలో ములుగు జిల్లా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం ములుగు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో అంతర్జాతీయ, భారత, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఒలింపిక్ డే రన్ 2026' కార్యక్రమానికి ఆమె జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించి మంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..స్టేడియం నిర్మాణం కోసం జిల్లా క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు రూ.4 కోట్ల నిధులతో అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణాన్ని మంజూరు చేసినట్లు ప్రకటించారు.క్రీడల్లో రాణిస్తున్న ములుగు జిల్లా మారుమూల, వెనుకబడిన ప్రాంతమైనప్పటికీ వాలీబాల్, ఆర్చరీ, క్రికెట్ వంటి క్రీడల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరుస్తూ దేశవిదేశాల్లో జిల్లా ఖ్యాతిని చాటుతున్నారని అభినందించారు. క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో మరిన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లాఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈవో సిద్ధార్థ రెడ్డి, డీఎస్పీ రవీందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పగడాల వెంకటేశ్వర రెడ్డి, పీడీలు, పీఈటీలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, జూన్ 24 (వుదయం ప్రతినిధి) :**

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, క్రీడా సదుపాయాలు, ప్రయోగశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం రఘునాథపల్లి మండలం నిడిగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్), మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.6, 7 తరగతి గదులకు వెళ్లిన కలెక్టర్.. విద్యార్థుల పఠన సామర్థ్యాలను, పాఠ్యాంశాల అవగాహనను స్వయంగా పరిశీలించారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలను మెరుగుపరిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి, సాయంత్రానికి పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం పరిశీలనలో కట్టెలతో వంట చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సురక్షిత పద్ధతులు పాటించాలన్నారు. కంప్యూటర్, మ్యాథ్స్, సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించి, అదనంగా జీవశాస్త్ర ల్యాబ్ ఏర్పాటు చేయాలని, అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. చదువుతో పాటు టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్, వాలీబాల్, ఖోఖో, బాస్కెట్ బాల్ వంటి క్రీడలను ప్రోత్సహించి, ఈ పాఠశాలను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు."ఫాస్ట్ మ్యాథ్స్" పుస్తకం ఆవిష్కరణ:అనంతరం జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుండి 12వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన "ఫాస్ట్ మ్యాథ్స్" పుస్తకాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆవిష్కరించారు. గణితంపై భయాన్ని వీడి, సులభ పద్ధతుల్లో సమస్యలను వేగంగా సాధించేలా ముఖ్యమైన సూత్రాలు, చిట్కాలతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు.ఈ పుస్తకం యొక్క సాఫ్ట్ కాపీని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే పంపాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు దీనిని బోధనలో భాగంగా ఉపయోగిస్తూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, విద్యార్థులు పునరావృత అభ్యాసం(రివిజన్) ద్వారా గణితంలో ఉత్తమ మార్కులుసాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లోఏఎంఓ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, ప్రధానోపాధ్యాయులుఅఫ్సర్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నల్గొండను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




**నల్గొండ, వుదయం:**

నల్గొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.బుధవారం నల్గొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు రూ.1.20 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రెండు సిటీ బస్సు సర్వీసులను కూడా ప్రారంభించారు.పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం సిటీ బస్సు సేవలను అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలిపారు. మెడికల్ కళాశాల విద్యార్థులు ఆస్పత్రికి వెళ్లేందుకు ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించినట్లు చెప్పారు.చెరువుగట్టు—ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధరవేశిపురం నుంచి దుప్పలపల్లి వరకు సిటీ బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నల్గొండకు అదనంగా 30 బస్సులు కేటాయించామని పేర్కొన్నారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ బంక్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.బస్టాండ్ విస్తరణలో కొత్త కౌంటర్లు, వెయిటింగ్ గార్డెన్, బాత్రూములు, టాయిలెట్లు, ఆధునిక ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనుల కోసం అదనంగా రూ.5 కోట్ల నిధులు వెచ్చించనున్నట్లు చెప్పారు.పట్టణానికి రూ.83 కోట్లతో తాగునీటి శుద్ధి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, పరిశుభ్రత, సుందరీకరణకు ప్రాధాన్యం ఇచ్చి నల్గొండను మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవర్, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు కవిత, రమేష్, లైజన్ ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయం: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్




**యాదాద్రి భువనగిరి, వుదయం**

బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడ్డగూడూర్ మండలం రేపాక గ్రామ శివారు లో గల ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం 10మంది రైతులకు ఎకరానికి 12 లక్షలు చొప్పున ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రైతులకు చెక్ లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏమ్మెల్యే మాట్లడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూ సేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ముఖ్య ఉద్దేశమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ స్పష్టం చేశారు. డి రేపాక గ్రామ రైతుల భూములకు సంబంధించిన పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో నిర్ణయించిన రేటు ప్రకారం ఎకరాకు కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. అయితే, దశాబ్దాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితిని వివరించడానికి తాను స్వయంగా జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యానని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, నిర్ణయించిన రూ. 6 లక్షలకు తోడుగా మరో రూ. 6 లక్షలు కలిపి అందించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందుకు అంగీకరించిన కలెక్టర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసినందుకు స్థానిక ఆర్డీఓకు, అలాగే ఇందుకు పూర్తిగా సహకరించిన మోత్కుర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డికి, సర్పంచ్‌కు, గ్రామ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,తహసీల్దార్ ఎ. శేషగిరి రావు,డిప్యూటీ తహసీల్దార్ నరసింహ రావు, నగేష్ కుమార్,రెవిన్యూ ఇన్స్పెక్టర్,మాదవి GPO రేపాక గ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నూతన గద్దెకు శంకుస్థాపన

**చిలుకూరు జూన్ 24:(వుదయం)**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు గో టు విలేజ్ కార్యక్రమంలో, భాగంగా చిలుకూరు మండలంలోని సీతారామపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ గద్దె శంకుస్థాపన బుధవారం చేశారు, ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి కొండపల్లి ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరి, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మాతంగి వీరస్వామి మాదిగల ఆధ్వర్యంలో, ఎమ్మార్పీఎస్ గద్దె శంకుస్థాపన చేయడం జరిగింది, వారు మాట్లాడుతూ,మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలను గ్రామాలలో వున్న మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు ఉపయోగించుకొని ఉద్యోగాలు సాధించేలా చైతన్య పరచడం కోసం ఏర్పాటు చేయడం జరిగింది



అన్నారు.జాతి ఆత్మగౌరవ పతాకమైన ఎమ్మార్పీఎస్ దిమ్మెలను ప్రతి గ్రామంలో నిర్మాణం చేసుకొనిజూలై 7న తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామాలలో పెద్ద ఎత్తున పండగ వాతావరణం లో చేపట్టాలని అన్నారు. మే 25 నుండి జులై 5 వరకు కొనసాగే గో టు విలేజ్ 40 రోజుల కార్యక్రమం సందర్భంగా ప్రతి గ్రామాలలో జాతిని సంఘటితం చేస్తూ ప్రచారాలలో పాల్గొని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ జాతిని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**భూపాలపల్లి జూన్ 24 (వుదయం విలేకరి)**

భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం చెల్పూరు గ్రామానికి చెందిన కంచర్ల శోభ – కుమార్ దంపతులు, మైలారం గ్రామానికి చెందిన తంగళ్ళ సరోజన నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ఇల్లు లేని పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ప్రతి అర్హులైన కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## మణుగూరు పాలిటెక్నిక్ అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు

**రూ.1.45 లక్షల చెక్కును కలెక్టర్ అంకిత్‌కు అందజేసిన బీటీపీఎస్ అధికారులు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 24 (వుదయం ప్రతినిధి)**

మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద రూ.1.45 లక్షల చెక్కును బీటీపీఎస్ సీఈ బిచ్చన్న ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో సీఎస్ఆర్ నిధులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సమాజాభివృద్ధిలో భాగంగా మరిన్ని సంస్థలు విద్యారంగ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. బీటీపీఎస్ సీఈ బిచ్చన్న మాట్లాడుతూ, మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ఖమ్మం, వుదయం బ్యూరోజూన్- 24:**

స్పెషల్ఇం టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో రానున్న 30 రోజులలో ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని తిరిగి స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో టామ్ టామ్ నిర్వహించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి తమ వివరాలను సక్రమంగా అందించాలని కోరారు.అన్‌మ్యాప్డ్ ఓటర్లు నిర్దేశించిన 11 ధృవ పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని తెలిపారు. జిల్లాలో గుర్తించిన ఎక్కువ శాతం అనామలీలను ఇప్పటికే పరిష్కరించినట్లు తెలిపారు. అవసరమైన పత్రాలు సమర్పించిన వారికి తక్కువ సమయంలోనే దరఖాస్తుల పరిష్కారం చేయనున్నట్లు అన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) వివరాలను వెంటనే అందజేయాలని సూచించారు. ప్రతి అర్హమైన ఓటరు ఓటు హక్కు కొనసాగేందుకు రాజకీయ పార్టీలు ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రతి బీఎల్ఏ తమ రాజకీయ పార్టీ జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగి ఉండాలని స్పష్టం చేశారు.ముసాయిదా ఓటరు జాబితాలో ఎవరి పేరు లేకపోయినా తప్పనిసరిగా అభ్యంతరం నమోదు చేయాలని, అభ్యంతరం నమోదు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమం కోసం జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి సమస్యలు, సందేహాలను వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట్ల బీఎల్‌వోలకు సహాయక సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు వి.రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, బి. జసవంత్, లింగనబోయిన సతీష్ బాబు, మంకన రమేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నర్సింహారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు ఎస్. నవీన్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అర్హులకే రాజన్న కోడెలు.. అక్రమాలకు చెక్

**పారదర్శకంగా 120 జతల కోడెల పంపిణీ**

**పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు : విప్ ఆది శ్రీనివాస్**

**హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వేములవాడ, జూన్ 24 (వుదయం ప్రతినిధి):**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి గోశాల నుంచి అర్హులైన రైతులకు కోడెలను పూర్తిస్థాయి పారదర్శకతతో పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో బుధవారం 120 జతల కోడెల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు కోడెలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా వేములవాడలో రాజన్నకు కోడె కట్టే విశిష్ట సంప్రదాయం కొనసాగుతోందన్నారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా స్వామివారికి సమర్పించే కోడెలను రైతుల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తిప్పాపూర్ గోశాల ద్వారా రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలపై దేవాదాయ, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కోడెలను పక్కదారి పట్టించడం, ఇతర అవసరాలకు వినియోగించడం వంటి చర్యలు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మర్రిపల్లిలో 40 ఎకరాల్లో ఆధునిక సౌకర్యాలతో గోశాల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించిందని తెలిపారు. త్వరలోనే గోశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యతనిస్తూ కోడెల పంపిణీ చేస్తున్నామని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల అర్హ రైతులకు కూడా త్వరలో పంపిణీ విస్తరించనున్నట్లు చెప్పారు. రైతులు కోడెలను సంరక్షించి వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతుల అర్హతలను పశుసంవర్ధక, ఆలయ, వ్యవసాయ శాఖల కమిటీ పరిశీలించి కోడెలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. రైతులు వీటిని రాజన్న ప్రసాదంగా భావించి వ్యవసాయ పనులకే వినియోగించాలని సూచించారు. పంపిణీ చేసిన కోడెలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి, ఆలయ ఈఓ రమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లోకేష్ స్థానిక కౌన్సిలర్ ఎల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఊర పండుగ అమ్మవార్ల గద్దె పరిశీలించిన ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్, వుదయం, జూన్ 24:**

ఆషాఢ మాసంలో ఘనంగా నిర్వహించే ఊర పండగ అమ్మవార్ల గద్దెను భక్తుల సౌకర్యార్థం మార్పులు చేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. సర్వ సమాజ్ కమిటీ పెద్దలతో కలిసి బుధవారం నగరంలోని ఖిల్లా ప్రాంగణంలో గల గద్దెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తులకు దేవుళ్లు దూరం నుంచి కూడా కనపడేలా ఎత్తు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే గద్దె ను అదనంగా నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించి ఊర పండగ కు సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గద్దె వద్దకు ఇందూరు భక్తులు భారీగా తరలి వస్తారని, ఇబ్బందులు కలగకుండా అదనపు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మొరంతో గద్దె చుట్టుపక్కల చదును చేయించాలన్నారు. అనంతరం సర్వ సమాజ కమిటీ పెద్దలు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం మూడో ఆదివారం ఊర పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. అయితే ఈసారి సంకటహర చతుర్థి రావడంతో ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గద్దె అదనపు నిర్మాణానికి సహకరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్వ సమాజ్ కమిటీ కార్యదర్శి బంటు రాజేశ్వర్, ఊర పండగ కన్వీనర్ రామర్తి గంగాధర్, స్థానిక కార్పొరేటర్ మల్కాయ్ మహేందర్, మున్నూరు కాపు సంఘం గాజులపేట అధ్యక్షుడు కొరడి కిరణ్, లక్ష్మీనారాయణ కొరడి నడిపి నరసయ్య, మను బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రవీందర్, రాజేందర్, లింబాద్రి, సంతోష్, సాయినాథ్, జితేందర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, కల్పే అర్చనా చిరంజీవి, మాజీ కార్పొరేటర్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హామీ**





**కామారెడ్డి, జూన్ 24 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జర్నలిస్టు ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి (డిపిఆర్వో) నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ.. టీయుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో బుధవారం జర్నలిస్టులు ధర్నాకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో యూనియన్ ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. కలెక్టర్ దృష్టికి డిపిఆర్వో సమస్యలు, డిపిఆర్వో వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను జర్నలిస్టులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఆమోదం పొందిన 273 అక్రిడిటేషన్ కార్డులలో కొన్నింటిని మాత్రమే పంపిణీ చేసి, మిగతా కార్డుల జారీకి డిపిఆర్వో లేనిపోని కొర్రీలు పెడుతున్నారని వివరించారు. బస్ పాసుల విషయంలోనూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, జర్నలిస్టుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు డిపిఆర్వోను తక్షణమే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని, లేదా సంబంధిత శాఖకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందుతాయని హామీ ఇచ్చారు. అలాగే డిపిఆర్వో వైఖరిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్‌కు పర్యవేక్షణ బాధ్యతలు అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియను పర్యవేక్షించి, వెంటనే కార్డులు జారీ చేయాల్సిందిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరిని కలెక్టర్ ఆదేశించారు. అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో చర్చించి, అర్హులైన వారందరికీ త్వరితగతిన కార్డులు అందేలా చూడాలని సూచించారు. కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ లభించడంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.భారీగా తరలివచ్చిన జర్నలిస్టులు ఈ చర్చల కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వి. రజినీకాంత్, కార్యదర్శి తోట రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి జర్నలిస్టులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉంటూ నిశిత పరిశీలన చేయండి

**కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీఎల్ఏలకు కవ్వంపల్లి పిలుపు**



**కరీంనగర్ జూన్ 24 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్రంలో గురువారం నుంచి కేంద్ర ఎన్నిక సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) జాబితాను నిశితంగా పరిశీలించి, ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ప్రక్రియను పర్యవేక్షించాలని డాక్టర్ కవ్వంపల్లి కోరారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళుతున్నప్పుడు బీఎల్ఏలు తప్ప కుండా వారి వెంట ఉంటూ నిశిత పరిశీలన చేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం గమనిస్తూ, ఓటర్ల వివరాల సవరణలో ఎలాంటి లోపాలు ఉన్నా లేదా అనుమానాస్పద అంశాలు కనిపించినా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డాక్టర్ కవ్వంపల్లి సూచించారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలపై కఠిన చర్యలు .. జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జూన్ -24 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలు, భూ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముత్తారం మండలంలోని పోతారం, మైదంబండ గ్రామాల్లో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలపై సమగ్ర విచారణ నిర్వహించినట్లు తెలిపారు.విచారణలో భాగంగా రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన,సంబంధిత అధికారుల నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించగా పోతారం గ్రామంలోని సర్వే నెం.59లో 19 ఎకరాలు 01 గుంటల భూమి, మైదంబండ గ్రామంలోని సర్వే నెం.113లో 11 ఎకరాలు 02 గుంటల భూమి ప్రభుత్వ భూములుగా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు.సంబంధిత వ్యక్తులు సదరు భూములను ఎప్పుడూ సాగు చేయలేదని, భూములు వారి భౌతిక స్వాధీనంలో కూడా లేవని విచారణలో తేలిన నేపథ్యంలో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలను రద్దు చేసినట్లు తెలిపారు.తదనుగుణంగా సంబంధిత భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకుని నోషనల్ ఖాతాలో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పూర్తి చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై, ప్రభుత్వ భూములపై అక్రమ హక్కులు పొందేందుకు సహకరించిన మిషన్ భగీరథ మంథని సబ్ డివిజన్ హెల్పర్ గుజ్జుల శ్రీధర్ , మంథని ముత్తారం ఎంపిడిఓ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ పాదాల సతీష్, ముత్తారం నరేగా ఫీల్డ్ అసిస్టెంట్ ధూమల శ్రవణ్ వారిపై, అలాగే ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధి: ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ (వుదయం ప్రతినిధి) :**

ఆదిలాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో యూఐడీఎఫ్ (UIDF) నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి ప్రారంభించారు.పట్టణంలోని 26, 27, 28, 29, 34, 42, 10వ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆదిలాబాద్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ముత్తడి వాగు, సాత్నాల, చెనకాకోట ప్రాజెక్టుల నుంచి నీటిని తీసుకువచ్చి ప్రజలకు నాణ్యమైన మంచినీరు అందించే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ద్వారా మున్సిపాలిటీ ఆదాయం పెంచడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. అర్బన్ చాలెంజ్ పథకం కింద సుమారు రూ.800 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.మున్సిపాలిటీలో విలీనం చేసిన గ్రామాల వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని, అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.యూఐడీఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి, ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పారదర్శక ఎన్నికలకు అందరి సహకారం కావాలి: తహసీల్దార్ బక్కయ్య



**జన్నారం, జూన్ 24(వుదయం విలేకరి)**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(SIR) ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు మండల తహసీల్దార్ బక్కయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు,సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సర్ ప్రక్రియ ఉద్దేశం, విధివిధానాలు, ఓటరు జాబితాల పరిశీలనలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులకు, ప్రజాప్రతినిధులు, అధికారులు,సిబ్బంది పూర్తి సహకారం అందించాలని కోరారు.అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల ప్రజాప్రతినిధులు,తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పనులు వేగవంతం చేయాలి -జిల్లా కలెక్టర్



**మంచిర్యాల/జూన్ 24 (వుదయం ప్రతినిధి**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాలి...

**అన్ని రాజకీయ పార్టీల సహకారం అందించాలి...**

**ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆదర్శంగా నిలవాలి...**

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి ఎస్ లత**



**జగిత్యాల జూన్ 24 (వుదయం ప్రతినిధి)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పకడ్బందీగా పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత కోరారు. సర్ కార్యక్రమం అమలులో జగిత్యాల జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సందర్శన చేపట్టి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి నింపిన ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి సేకరిస్తారని తెలిపారు ఈ ప్రక్రియలో బీఎల్ఏలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం చేపట్టి అక్టోబర్ 1 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. బీఎల్‌వోలు ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని ఫారం అందని వారు లేదా పొరపాటున జాబితాలో చేరని అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయించేందుకు రాజ కీయ పార్టీలు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు బీఎల్‌వో సూపర్వైజర్లు ప్రత్యేక అధికారులు నెల రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పని చేస్తారని తెలిపారు బిఎల్ఓ లు బిఎల్ఏ లకు పూర్తి స్థాయిలో సర్ కార్యక్రమం పై శిక్షణ కల్పించారని పేర్కొన్నారు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే సర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎలాంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించ బడకుండా అనర్హులు జాబితాలో చేరకుండా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఎన్ఎస్ఎస్ ఎన్సీసీ వాలంటీర్ల సహకారాన్ని కూడా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు ఓటర్ల మార్పులు చేర్పుల కోసం ఫారం-8 కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6 వినియోగించాలని సూచించారు. సర్ కార్యక్రమంపై గ్రామాలు పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జగిత్యాల కోరుట్ల మెట్ పెల్లి ఆర్డీవోలు మధుసూదన్ జీవాకర్ రెడ్డి నరసింహ రావు మున్సిపల్ కమిషనర్ లు రాజకీయ పార్టీ ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

**బీఎల్ఏలకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి**

**ఎన్యూమరేషన్ ఫారాలతో పాటు తాజా ఫొటో అందజేయాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**రాజన్న సిరిసిల్ల, జూన్ 24 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుందని, జిల్లాలో 549 పోలింగ్ కేంద్రాలు, 55 మంది బీఎల్ఓ సూపర్‌వైజర్లు, 549 మంది బీఎల్ఓలు విధులు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 4,75,694 మంది ఓటర్లు ఉండగా, వారిలో 4,04,414 మంది మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన వారి మ్యాపింగ్ కొనసాగుతోందని చెప్పారు.జూన్ 25 నుంచి జూలై 30 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను నింపి, తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో కలిసి జూలై 31లోగా బీఎల్ఓలకు అందజేసి రసీదు తీసుకోవాలని సూచించారు. ఫారాలతో పాటు గుర్తింపు కార్డుల జిరాక్స్ కాపీలు ఇవ్వాల్సిన అవసరం లేదని, కేవలం వివరాలు మాత్రమే అందించాలని చెప్పారు. జూలై 31న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురిస్తామని, అనంతరం అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లను ఆగస్టు 30 వరకు స్వీకరిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 28 నాటికి అన్ని అభ్యంతరాలను పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు.అక్టోబర్ 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండాలనేది ఎన్నికల సంఘం లక్ష్యమని, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు కలిగి ఉండడం నేరమని స్పష్టం చేశారు.ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే సమయంలో బీఎల్ఓలకు సహకరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లు, రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈసమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మత్తుకు దూరంగా ప్రగతికి చేరువగా..

**మగ్గిడి మోడల్ స్కూల్‌లో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు**

**చెడు వ్యసనాలకు యువత బలికావొద్దు**

**ధర్మపురి ఎస్ఐ జి.మహేష్**



**ధర్మపురి, జూన్ 24 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థులు,యువత మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని ఎస్సై జి.మహేష్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్,గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజానికి పట్టిన మహమ్మారిలా డ్రగ్స్ మారుతున్నాయని, వీటి వినియోగం వల్ల యువత శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బ తినడమే కాకుండా వారి విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం పూర్తిగా కుంటుపడుతుందని ఎస్ఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారి మత్తుకు బానిసైతే సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసు శాఖకు తెలియజేయాలని ఎస్ఐమహేష్‌కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా కేవలం చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలు,నైతిక విలువలపైనే దృష్టిసారించాలని ఎస్ఐ సూచించారు. యువతను ఈ మహమ్మారి నుంచి రక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## వార్డుల అభివృద్ధే ధ్యేయం..మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి



**ధర్మపురి,జూన్24(వుదయం ప్రతినిధి):**

ధర్మపురి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని 1వ వార్డులో రూ.17లక్షల వ్యయంతో మంజూరైన డ్రైనేజీ,సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తు న్నామన్నారు. ఈ పనులు పూర్త యితే స్థానికులకు రాకపోకల ఇబ్బందులు,పారిశుద్ధ్య సమస్య లు తొలగిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు అయ్యోరి వేణుగోపాల్, ముడుసుల ప్రశాంత్, ప్రజాప్రతినిధులు,అధికారులు వార్డు ప్రజలు పాల్గొన్నారు

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## విద్యా ప్రస్థానంలో ఇష్ట జూనియర్ కళాశాల మరో మైలురాయి.



**- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయి ర్యాంకులతో సత్తా చాటిన విద్యార్థులు**
**– నాణ్యమైన శిక్షణకు మరో నిదర్శనం**
**సంగారెడ్డి :వుదయం జిల్లా ప్రతి నిధి.**

పోటీ పరీక్షల ప్రపంచంలో ప్రతిభ, క్రమశిక్షణ, నాణ్యమైన శిక్షణ కలిస్తేనే విజయాలు సాధ్యమవుతాయి. ఆ సూత్రాన్నే ఆచరణలో చూపిస్తూ సంగారెడ్డి పట్టణంలోని ప్రగతి నగర్‌లో ఉన్న ఇష్ట జూనియర్ కళాశాల మరోసారి తన ప్రత్యేకతను నిరూపించింది. 2026 ఐఐటీజేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి సంస్థకు గర్వకారణంగా నిలిచారు.దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో జి. సాయి వెంకట్ ఆల్ ఇండియా ర్యాంక్ (AIR) 67 సాధించడం విశేషం. అదే విధంగా జి. అక్షయ AIR 717తో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎన్. ఉమా లోకేష్ AIR 3172, ఎం. సాత్విక్ AIR 3382 ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. జేఈఈ మెయిన్స్‌లో ఎన్. సాయి భార్గవ్ AIR 1588, పి. సిద్ధార్థ AIR 6095 సాధించడం సంస్థ శిక్షణా ప్రమాణాలను ప్రతిబింబిస్తోంది.

ఫలితాల వెనుక నాణ్యమైన విద్యా విధానంఈ విజయాలు ఒక్కరోజులో సాధించినవి కావు. విద్యార్థుల నిరంతర కృషి, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల నిబద్ధత, సంస్థ అమలు చేస్తున్న ప్రణాళికాబద్ధమైన విద్యా విధానం కలిసి ఈ ఫలితాలకు బాటలు వేసాయి. ఐఐటీ, నీట్, ఎంసెట్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ విద్యార్థులలో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంపై కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తోంది. నిరంతర పరీక్షలు, సందేహ నివృత్తి తరగతులు, వ్యక్తిగత అకడమిక్ మానిటరింగ్, ప్రత్యేక అధ్యయన ప్రణాళికలు, ఆధునిక బోధనా విధానాలు విద్యార్థుల విజయాలకు బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. విద్యార్థుల విజయాలకు బలమైన మౌలిక వసతులువిశాలమైన తరగతి గదులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, సాంకేతికత ఆధారిత బోధన, ప్రత్యేక కోచింగ్ విధానాలు, నిరంతర మూల్యాంకన వ్యవస్థ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో కళాశాల ముందంజలో ఉంది. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, అతని లక్ష్యానికి అనుగుణంగా మార్గనిర్దేశం చేయడం సంస్థ ప్రత్యేకతగా నిలిచింది.విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంకళాశాల ఛైర్మన్ కార్తీక్ కోట మాట్లాడుతూ విద్యార్థులను కేవలం పరీక్షల్లో విజయవంతులను చేయడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పోటీ స్ఫూర్తిని పెంపొందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రముఖ విద్యావేత్త డా. చుక్కా రామయ్య అందించిన మార్గనిర్దేశం సంస్థ అభివృద్ధికి దిశానిర్దేశంగా నిలిచిందని అన్నారు.అకడమిక్ డీన్ వి.ఎ. ప్రైమ్ కుమార్ మాట్లాడుతూ అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నిపుణులైన అధ్యాపకులు, పోటీ పరీక్షలకు అనుగుణమైన ప్రత్యేక శిక్షణా విధానాలతో విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. విద్యను కేవలం మార్కులకే పరిమితం చేయకుండా విశ్లేషణాత్మక ఆలోచన, సమయ నిర్వహణ, సమస్యల పరిష్కార సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు.డైరెక్టర్ కె. వినోద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునే వరకు సంపూర్ణ విద్యా సహకారం అందించడమే సంస్థ ధ్యేయమని, ఐఐటీజేఈఈ, వైద్య ప్రవేశ పరీక్షలు, ఇతర ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షల్లో విజయాలు సాధించేలా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.సంగారెడ్డి విద్యారంగానికి గర్వకారణంజాతీయ స్థాయి ర్యాంకులతో ఇష్ట జూనియర్ కళాశాల మరోసారి తన విద్యా ప్రమాణాలను చాటుకుంది. నాణ్యమైన బోధన, ఫలితాలపై దృష్టి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కట్టుబాటు వంటి అంశాలతో ఈ సంస్థ సంగారెడ్డి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర విద్యారంగంలో కూడా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. తాజా ఫలితాలు కళాశాల విద్యా ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలవడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని విజయాలకు బాటలు వేస్తున్నాయని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

**- గంట్రావుపల్లి, చెన్నపురావుపల్లిలో గృహ ప్రవేశ వేడుకలు**
**నాగర్ కర్నూల్, జూన్ 24 (వుదయం బ్యూరో):**



అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి, చెన్నపురావుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు.లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తొలి విడతలో రూ.22,500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు.రెండవ విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, నియోజకవర్గానికి 2 వేల ఇండ్ల చొప్పున మంజూరు చేసినట్లు చెప్పారు.కులం, మతం, వర్గం, రాజకీయ అనుబంధం చూడకుండా అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తున్నామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. ఇండ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం దశలవారీగా బిల్లులు చెల్లిస్తూ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

## గీతంలో సీనియర్ రీసెర్చ్ ఫెలో అవకాశం

**- జూలై 10లోగా దరఖాస్తు చేసుకోవాలి, 14న ఇంటర్వ్యూలు**
**పటాన్చెరు (వుదయం):**

భారత ప్రభుత్వ అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) నిధులు సమకూర్చే ప్రాజెక్టు కింద, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్) పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఫార్మాస్యూటిక్స్ విభాగానికి చెందిన డాక్టర్ భవానీ శంకర్ సతపతి నేతృత్వంలోని 'నిరోధక యోని బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా స్థానికీకరించిన లక్షిత విధానంగా క్లిండామైసిన్ నానోపార్టికల్స్ తో అనుసంధానించిన కైటోసాన్‌సియాలిల్ లాక్టోస్ జెల్ స్కాఫోల్డ్: ప్రీక్లినికల్ సమర్థత ధ్రువీకరణ' అనే పరిశోధన ప్రాజెక్టు కింద ఈ పోస్టు అందుబాటులో ఉందని తెలియజేశారు.

నాటికి గరిష్ఠ వయో పరిమితి 28 సంవత్సరాలు ఉండాలని, భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ తాజా సీవీ, మార్కుల ధ్రువీకరణ పత్రాలు, జీపీఏటీ/ఎన్ఈటీ అర్హత ధృవీకరణ పత్రం (ఉంటేనే), స్వీయ ప్రచురిత ప్రతాలు (ఏవైనా ఉంటే).. అన్నింటినీ కలిపి ఒకే పీడీఎఫ్ ఫైలుగా bsatapat@gitam.edu కు ఈమెయిల్ చేయాలన్నారు. దాని సబ్జెక్ట్ లైన్లో "Application for SRF Position under ANRF Project" అని పేర్కొన్నాలని స్పష్టీకరించారు. దరఖాస్తులను జూలై 10వ తేదీలోగా సమర్పించాలని, జూలై 14న ఇంటర్వ్యూలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు మాత్రమే ఈమెయిల్ సమాచారం పంపుతామని తెలిపారు.

## ఖేడ్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే నా లక్షం

**- ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవ రెడ్డి .**
**నారాయణఖే**
**జూన్ 24(వుదయం)**



నారాయణఖేడ్ నియోజకవర్గని అన్ని రంగాలలో అభివృధి చేయడమే నా లక్ష మని ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవ రెడ్డి అన్నరు.నారాయణఖేడ్ నియోజకవర్గ మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఖేడ్ మండల పరిధిలోని పల్గుతండా పంచాయతీ లో ( ఎంజీఎంఆర్ఈ జి ఎస్)(ఉపాధి హామీ) నిధులు రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ కాలువల పనులు ప్రారంభించారు. నాగుల్ గిద్ద మండలం కేశ్వర్ గ్రామంలో 5 లక్షల రూపాయల వ్యాయంతోకూడిన సిసి రోడ్డు పనులను ప్రారంభించారు, అనంతరం గూడూరు గ్రామంలో ఐదు లక్షల రూపాయలు సిసి రోడ్డు పనులను ప్రారంభించారు అనంతరం ముక్తాపూర్ గ్రామం రాంసింగ్ తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులోని పాలిటెక్నిక్ కళాశాలలో 30 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం తాండాలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారి విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్ దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలియజేశారు.నియోజకవర్గంలోని ప్రతి తండాను, గ్రామాలను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లడానికి సరైన సౌకర్యం లేకపోవడంపై గత కొంతకాలంగా విద్యార్థులు అధ్యాపకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించానన్నారు. సిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతీయున మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సిసి రోడ్డు నిర్మాణంతో పాలిటెక్నిక్ కళాశాలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడుతుందని తెలిపారు. విద్యారంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రధానిఅత్య ఇస్తుందని నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్య సంస్థలో విడతల వారీగా మౌలిక వసతులను మెరుగు పరుస్తామని ఆయన స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు సంబంధిత అధికారులు సమన్వయంతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాలవ్యవాదిలోగా రోడ్డు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.అనంతరం తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్ (దుస్తులు) పంపిణీ చేశారు. అలాగే, స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు అనాధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయితీ



**- ప్రైవేట్ పాఠశాలల్లో ఒకరికి ఉచిత విద్య.. మరొకరికి 50% ఫీజు రాయితీ**
**- జోగులాంబ గద్వాల డీఈఓ విజయలక్ష్మి సర్క్యులర్ జారీ**
**గద్వాల జూన్ 24 (వుదయం బ్యూరో)**

జిల్లాలోని జర్నలిస్టుల కుటుంబాలకు విద్యా పరంగా ఊరటనిచ్చే కీలక నిర్ణయం వెలువడింది. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక ఫీజు రాయితీలు కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) విజయలక్ష్మి సర్క్యులర్ జారీ చేశారు. ఈ మేరకు బుధవారం జర్నలిస్టులకు సర్క్యులర్ ప్రతులను అందజేశారు.సర్క్యులర్ ప్రకారం, అర్హులైన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన ఇద్దరు పిల్లల్లో ఒకరికి పూర్తిస్థాయి ఉచిత విద్యను, మరొకరికి ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రైవేట్ పాఠశాలలు కల్పించనున్నాయి. ఈ అవకాశాన్ని జిల్లాలోని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ సదుపాయం పొందదలచిన జర్నలిస్టులు డీఈఓ కార్యాలయం జారీ చేసిన సర్క్యులర్ ప్రతితో పాటు తమ అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీని జతచేసి, తమ పిల్లలు చదువుతున్న లేదా చేర్పిం చదలచిన పాఠశాల యాజమాన్యా నికి సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ పాఠశాల యాజమాన్యం ఈ సౌకర్యాన్ని అమలు చేయడంలో నిరాకరిస్తే, సంబంధిత జర్నలిస్టులు జిల్లా విద్యాశాఖ అధికారికి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలి స్టులు ముకుందరావు, ఇస్మాయిల్, బలరాం కృష్ణ, మహేష్, సత్యం తదితరు లు పాల్గొన్నారు.

## శుభకార్యంలో ఫుడ్ కమిషన్ చైర్మన్



**వెల్దండ జూన్ 24 (వు దయం)**

మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు బాధ్య నాయక్ కుమారుడు ఉపేందర్ అశ్విని ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ బిఆర్ ఎస్ పార్టీ నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారుఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బిఆర్ ఎస్ నాగులు నాయక్, పార్టీ గ్రామ అధ్యక్షులు తారసింగ్, గ్రామ నాయక్ శ్రీను, మెండే శ్రీను,రాజేంద్రప్రసాద్, నిరంజన్,రవి,కృష్ణ, భాస్కర్,తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**వనపర్తి జూన్ 24 (వుదయం ప్రతినిధి)**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల హాస్టల్‌లో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థుల సంఖ్య, వసతి గృహ నిర్వహణపై ఆరా తీశారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వంటశాలను పరిశీలించి, వంట గ్యాస్ కనెక్షన్ తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. హాస్టల్‌కు ప్రహరీ గోడ నిర్మాణం అవసరమని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దమందడి జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల భవనాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా పెద్దమందడిలో చేపట్టిన అవగాహన ర్యాలీ ని కలెక్టర్ పరిశీలించి, ప్రజల్లో ఎస్ ఐ ఆర్ పై విస్తృత అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన మండలకేంద్రం లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. షేర్‌వాల్ టెక్నాలజీతో సుజాత అనే లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాన్ని సందర్శించి పరిశీలించారు. నిర్మాణ వ్యయం, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. తక్కువ వ్యయంతో, వేగవంతంగా గృహ నిర్మాణం చేపట్టేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. షేర్‌వాల్ టెక్నాలజీని మరింత మంది ప్రజలకు చేరవేసి ప్రోత్సహించాలని ఎంపీడీవోను ఆదేశించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో షేర్‌వాల్ టెక్నాలజీకి అవసరమైన అల్యూమినియం మెటీరియల్‌ను కొనుగోలు చేసి జిల్లాలో ఈ నిర్మాణ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో ఇద్దరు లబ్ధిదారులు నాగమ్మ, కృష్ణయ్యల ఇండ్లను సందర్శించి ఇండ్ల నిర్మాణాల కోసం వారికి అవుతున్న ఖర్చు గురించి ఆరా తీశారు. ఇంటి నిర్మాణం కోసం ఎక్కడ అప్పు తీసుకోవద్దని లబ్ధిదారులకు సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలను ఇప్పించే సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విటోభా, తహసీల్దార్ మల్లికార్జున,ఎంపీడీఓ పరిణత సర్పంచ్ నాగమ్మ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేజీబీవీలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**మహబూబ్ నగర్ జూన్ 24 (వుదయం ప్రతినిధి)**

గండీడ్ మండలంలో నిర్వహిస్తున్న మహమ్మదాబాద్ మండల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కె. జి. బి. వి), గండీడ్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హచ్.సి)లను బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా కె. జి. బి. వి పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కె. జి. బి. వి స్పెషల్ ఆఫీసర్ కుమారి శివలీల విద్యాశాఖ ఉన్నత అధికారుల అనుమతి లేకుండా గైర్హాజరైనట్టు గమనించిన కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీకి ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మదాబాద్ మండల కె.జి.బి.వి స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు.మహమ్మదాబాద్ కె.జి.బి.వి తనిఖీలో ఉపాధ్యాయులు వరండాలో ఉండటానికి గమనించిన కలెక్టర్ వారి వారి తరగతులలో వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, టైం టేబుల్ ప్రకారం విద్యార్థులకు పాఠాలు బోధించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు,సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. 10వ తరగతి, 8వ తరగతి విద్యార్థుల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న విద్య బోధన, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉదయం అల్పాహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు ఎప్పుడు పాఠశాలకు చేరుకున్నారూ, వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను కూడా కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మరుగుదొడ్ల సౌకర్యం ఎలా ఉంది, ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా, అనే విషయాల పై కూడా కలెక్టర్ విద్యార్థుల నుండి వివరాలు తెలుసుకున్నారు. స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, అక్కడ కూరగాయలను సరిగా పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కె .జి.బి.వి నూతన భవన పనులను తనిఖీ చేశారు. కాంట్రాక్టర్, వర్కర్లతో మాట్లాడి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. మండల విద్యాధికారికి కె .జి.బి. వి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని ఆదేశించారు.గండీడ్ పి.హెచ్.సి ని తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తాగండీడ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రతిరోజూ నమోదవుతున్న ఓ.పి.నమోదు సంఖ్య, మందుల లభ్యత, గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, లేదా అనే అంశాలపై వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవం జరిగిన ఓ మహిళతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా అని ఆరా తీశారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారికి కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్య అధికారి జనార్ధన్, వైద్య అధికారి డా. చందు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హలో మాల చలో మెదక్ సభను విజయవంతం చేయాలి



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలం ఈనెల 28న మెదక్లో నిర్వహించనున్న హలో మాల చలో మెదక్ సభను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నిజాంపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వల్లనే మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఎస్సీ వర్గీకరణతో మాల యువకులు ఉద్యోగం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 28న ప్లేట్లో జరిగే సభకు అధిక సంఖ్యలో మాల కుల బాంధవులు హాజరవాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు బండారు చంద్రయ్య. రాష్ట్ర నాయకులు ఊరట్ల శివ, గోవు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

## క్రీడలతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం

**- సిద్దిపేటలో ఘనంగా 40వ ఒలింపిక్ డే రన్ నిర్వహణ**
**వుదయం, సిద్దిపేట ( జూన్ 24)**



సిద్దిపేట జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40వ ఒలింపిక్ డే రన్ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ఈ రన్‌ను మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని అన్నారు. యువత క్రీడలను జీవనశైలిలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ స్ఫూర్తి అయిన స్నేహం, గౌరవం, క్రమశిక్షణ, ప్రతిభ వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు.అనంతరం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఒలింపిక్ డే కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో కూడా ఈ రన్‌ను విజయవంతంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది "Let's Move and Celebrate" థీమ్‌తో నిర్వహిస్తున్న ఒలింపిక్ డే ద్వారా ఆరోగ్యం, ఫిట్‌నెస్, క్రీడాస్ఫూర్తి విలువలను సమాజానికి చేరవేయడమే లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు, యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. క్రీడా సంస్కృతి మరింత బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నామినేట్ కమిటీ సభ్యులను అభినందిస్తూ, వారి సహకారంతో 40వ ఒలింపిక్ డే రన్ విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ఒలింపిక్ స్ఫూర్తిని ప్రజల్లో మరింత విస్తృతంగా చాటిచెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వరగంటి శాస్త్రి, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి (డీవైఎస్ఓ) వీరారెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ గన్నె రాజిరెడ్డి, సహ కన్వీనర్ జి. కిరణ్ కుమార్, కార్యనిర్వాహక సభ్యురాలు ఎ. సౌందర్య, కార్యనిర్వాహక సభ్యుడు కె. హరికృష్ణ, యువజన సభ్యులు రాజు, లక్ష్మణ్, వంశీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంతో చైర్మన్ భరత్ భూషణ్ భేటీ



APSFTVTDC చైర్మన్ P. భరత్ భూషణ్ గారు తాజాగా ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (FFI) వైస్ ప్రెసిడెంట్‌గా ఉంటూ, ఆంధ్రప్రదేశ్ లో సినిమా పరిశ్రమని అభివృద్ధి దిశగా నడిపిస్తానని టీంతో కలిసి కృషి చేస్తానని ముఖ్య మంత్రి గారితో అన్నారు.

అలాగే తాను APSFTVTDC చైర్మన్ అయిన తరువాత రేపు వెంకటపాలెం టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర జరగనున్న #NBK112 చిత్ర ప్రారంభోత్సవం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ మంత్రులు నారా లోకేష్ గారు, కందుల దుర్గేష్ గారు ముఖ్య అతిధులుగా హాజరు కావడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరిగేలా మ టీం అందరం కలిసి కృషి చేస్తాం

## నారాయణగూడలో నెల్లై కాఫీ ప్రారంభం




నటి అనన్య నాగళ్ల మరియు వీ6 తీన్మార్ చంద్రవ్వ నారాయణగూడలో నూతనంగా ప్రారంభమైన *'నెల్లై తాటిబెల్లం కాఫీ - వెజ్ రెస్టారెంట్'* ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులు, శ్రేయోభిలాషులు, ఆహార ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానులు *ఓంకార్ మోహన్* మరియు *నిశాంత్*లను వారు అభినందిస్తూ, నగరానికి ఒక ప్రత్యేకమైన ఆహార కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినందుకు ప్రశంసించారు. సంప్రదాయ తాటిబెల్లంతో తయారుచేసిన కాఫీతో పాటు, రుచికరమైన స్వచ్ఛమైన శాకాహార వంటకాలను అందించే ఈ వినూత్న కాన్సెప్ట్‌ను వారు ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.సభను ఉద్దేశించి మాట్లాడిన అనన్య నాగళ్ల మరియు చంద్రవ్వ, నాణ్యమైన ఆహారం, అద్భుతమైన రుచి, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం వెతుకుతున్న కుటుంబాలు మరియు ఆహార ప్రియులకు *'నెల్లై తాటి బెల్లం కాఫీ - వెజ్ రెస్టారెంట్'* ఎంతో ఇష్టమైన ప్రదేశంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రెస్టారెంట్ నిర్వహణ బృందం చూపిన అంకితభావం, కృషిని కొనియాడుతూ, ఈ సంస్థ భవిష్యత్తులో ఒక ప్రముఖ బ్రాండ్‌గా ఎదగాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రెస్టారెంట్ ప్రత్యేక వంటకాలను ఆస్వాదించిన అతిథులు, ఓంకార్ మోహన్ మరియు నిశాంత్‌ల కొత్త ప్రయాణానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని ముగించారు.



## కొండగట్టు అంజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1 లక్ష విరాళం

మల్యాల మండలం జూన్ 24 ( వుదయం ప్రతినిధి ) కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తుడు శ్రీ రంగ ధ్రువన్ పొన్నాల, కూకట్‌పల్లి వాస్తవ్యులు, రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డికి విరాళ చెక్కును అందజేశారు. స్వామివారి అనుగ్రహంతో కుటుంబ సభ్యులు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటూ నిత్యాన్నదాన కార్యక్రమానికి తన వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందించినట్లు రంగ ధ్రువన్ పొన్నాల తెలిపారు. ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు నిత్యం అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో భక్తుల సహకారం ఎంతో కీలకమని ఈఓ ఎస్. అంజనారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతకు కృతజ్ఞతలు తెలియజేసి, స్వామివారి ప్రసాదం మరియు ఆశీర్వచనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరెంటెంట్ సునీల్ మరియు టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

## మొహర్రం పండుగకు ఏర్పాట్లు చేయాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి




కరీంనగర్ జూన్ 24 (వుదయం ప్రతినిధి):మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మొహర్రం పండుగ ఏర్పాట్లు, నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొహర్రం పర్వదిన ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా ఊరేగింపు మార్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, ప్రత్యేక మరమ్మతులు, విద్యుత్ దీపాలు, నిరంతర విద్యుత్తు సరఫరా, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రత చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేయాలని అన్నారు. మున్సిపల్, విద్యుత్, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పండుగకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మతపెద్దలు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఊరేగింపు కోసం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డి సి పి వెంకటరమణ, ఆర్డీవోలు షర్మిల, జల కుమారి వివిధ శాఖలఉన్నతాధికారులు, మొహరం పండుగ నిర్వహణ కమిటీ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలపై సబ్సిడీకి దరఖాస్తుల ఆహ్వానం

మల్హార్, జూన్ 24 (వుదయం ప్రతినిధి):వాటర్ షెడ్ పథకం కింద రైతులకు వివిధ వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తాడిచెర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి తెలిపారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకునే రైతులు అప్లికేషన్ ఫారంతో పాటు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను జత చేసి ఈ నెల 25వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7981178930 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ పథకం కింద బ్యాటరీ స్ప్రేయర్లు, బ్రష్ కట్టర్లు, చాఫ్ కట్టర్లు, కల్టివేటర్లు, డీ-వాటరింగ్ పంపులు, డిస్క్ హారో, హాఫ్ కేజ్ వీల్స్, హెచ్‌డీపీఈ లే ఫ్లాట్ ట్యూబులు, తార్పాలిన్లు, తైవాన్ స్ప్రేయర్లు, ప్లౌలు, ఓపెన్ వెల్ మోటార్లు, ప్లాస్టిక్ క్రేట్లు, పోర్టబుల్ హెచ్‌టీపీ స్ప్రేయర్లు, పవర్ రీపర్లు, పవర్ వీడర్లు, రైన్ గన్స్, రౌండ్ బేలర్లు, సోలార్ ఫెన్సింగ్ కిట్లు, స్ప్రింక్లర్లు, పీవీసీ పైపులు తదితర వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని బండి స్వామి వెల్లడించారు. రైతులు ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను పొందేందుకు ముందుకు రావాలని, అవసరమైన పత్రాలతో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ బండి స్వామి కోరారు.

# ఇందిరమ్మ రిజర్వేషన్లకు 50 ఏళ్లు

### – ఆదివాసీ బస్సు యాత్రను విజయవంతం చేయండి: ఎస్టీ సెల్ చైర్మన్ శ్రావణ్ నాయక్



కరీంనగర్ జూన్ 24 (వుదయం ప్రతినిధి):రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ విభాగం చైర్మన్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో రేపు జూన్ 25న గాంధీభవన్ నుండి ఆదివాసీ బస్సు యాత్ర ప్రారంభం కానుందని జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జి శ్రీమతి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ ఆదివాసీ విభాగం చైర్మన్ విక్రాంత్ సింగ్ భూరియా హాజరై బస్సు యాత్రను ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. 1976లో అప్పటి ప్రధాని, ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ లంబాడీలను, ఎరుకలను, యానాదీలను ఎస్టీ జాబితాలో కలిపి రిజర్వేషన్లు కల్పించారని శ్రావణ్ నాయక్ గుర్తు చేశారు. ఆనాడు కల్పించిన రిజర్వేషన్ల వల్లనే నేడు ఎంతోమంది ఆదివాసీ బిడ్డలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మేయర్లు, జడ్పీ చైర్మన్లుగా, ఉన్నతమైన ఐఏఎస్, ఐపీఎస్ లాంటి పోస్టుల్లో ఉన్నారంటే అది ఆనాడు ఇందిరమ్మ ఇచ్చిన రిజర్వేషన్ల పుణ్యమేనని ఆయన కొనియాడారు. ఇందిరా గాంధీ రిజర్వేషన్లు ఇచ్చి 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, మాజీ ప్రధాని ఉక్కు మహిళ ఇందిరా గాంధీ గారిని స్మరించుకుంటూ ఈ బస్సు యాత్రను గాంధీభవన్ నుండి ప్రారంభిస్తున్నామని తెలిపారు. కావున బంజారా సోదరులు, ఎరుకల సోదరులు, యానాదీ సోదరులు, ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ బస్సు యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ చైర్మన్ బానోతు శ్రావణ్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

# విద్యారంగానికి పెద్దపీట

.. వేములవాడలో ఆల్ఫోర్స్ నూతన పాఠశాల ప్రారంభం
- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగంలో సమూల మార్పులు.
-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.






వేములవాడ, జూన్ 24 ( వుదయం ప్రతినిధి ) : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమూల మార్పుల దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పాఠశాలను బుధవారం ఆయన చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' కార్యక్రమం ద్వారా కనీస మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్, పరిశుభ్రత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ చేపట్టి ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. విద్యార్థుల ఆహారం, వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వేములవాడ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఏటీసీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ వ్యవస్థను తీసుకువచ్చి విద్యార్థులను పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వేములవాడలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్న విప్, ప్రైవేట్ విద్యాసంస్థలు సామాజిక బాధ్యతతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆధునిక జ్ఞానం కలగలిపిన విద్య అందించాలని, ఉపాధ్యాయులు వారి ప్రతిభను గుర్తించి లక్ష్యసాధనకు మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూము మధు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య, స్థానిక కౌన్సిలర్ ఎల శ్రీనివాస్, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పార్ట్‌టైం ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం




పెద్దపల్లి, జూన్ 25 (వుదయం కరస్పాండెంట్ ):పెద్దపల్లి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న 15 పార్ట్‌టైం బోధనా పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆరు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఈ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళా గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. పురుష అభ్యర్థులకు జూనియర్ లెక్చరర్ మ్యాథమెటిక్స్, జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్, పీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ ఇంగ్లీష్, టీజీటీ సోషల్, ఆర్ట్ టీచర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయని వివరించారు. మహిళా అభ్యర్థులకు జూనియర్ లెక్చరర్ తెలుగు రెండు పోస్టులు, జూనియర్ లెక్చరర్ మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ, ఎకనామిక్స్, పీజీటీ ఇంగ్లీష్, టీజీటీ మ్యాథ్స్, మ్యూజిక్ టీచర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయని తెలిపారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో పీజీ డిగ్రీతో పాటు బీఈడీ అర్హత ఉండాలని పేర్కొన్నారు. టీజీటీ పోస్టులకు సంబంధిత డిగ్రీతో పాటు బీఈడీ అర్హత తప్పనిసరి అని తెలిపారు. ఆర్ట్ టీచర్ పోస్టుకు బీఎఫ్ఏ లేదా టీసీసీ అర్హత, మ్యూజిక్ టీచర్ పోస్టుకు ఏదైనా డిగ్రీతో పాటు క్లాసికల్ మ్యూజిక్‌లో డిప్లొమా అర్హత ఉండాలని వివరించారు. బోధన పట్ల ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు ఈ నెల 29న గర్రెపెల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు)లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులు తీసుకువచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన, డెమో నిర్వహించి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ఎంపికైన వారికి జూనియర్ లెక్చరర్ పోస్టులకు నెలకు రూ.23,400, పీజీటీ/టీజీటీ పోస్టులకు రూ.18,200, స్పెషల్ టీచర్ (ఆర్ట్, మ్యూజిక్) పోస్టులకు రూ.14,170 వేతనం చెల్లిస్తామని వెల్లడించారు. పైన పేర్కొన్న ఖాళీల సంఖ్యలో అవసరాన్ని బట్టి మార్పులు, చేర్పులు ఉండవచ్చని, తుది నిర్ణయం ఎంపిక కమిటీదేనని జిల్లా సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ తెలిపారు.




## పోలీసు ప్రతిభకు డ్యూటీ మీట్ వేదిక

**జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026 ప్రారంభం.**

రాజన్న సిరిసిల్ల, జూన్ 24 (వుదయం ప్రతినిధి): పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో మరింత సమర్థవంతంగా రాణించాలంటే వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి 3వ పోలీస్ డ్యూటీ మీట్--2026ను అదనపు ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణ వంటి అంశాల్లో పోలీసు సిబ్బంది తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ సాంకేతికతలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై అవగాహన పెంపొందించేందుకు డ్యూటీ మీట్ ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది చట్టాలపై సంపూర్ణ అవగాహనతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. శాస్త్రీయ ఆధారాలతో నేరస్థులను న్యాయస్థానంలో దోషులుగా నిరూపించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అత్యంత అవసరమన్నారు. డ్యూటీ మీట్ ద్వారా అధికారులు, సిబ్బంది తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు వినూత్న ఆలోచనలను పరస్పరం మార్పిడి చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ మీట్‌లో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్స్, యాంటీ-సబోటేజ్ చెకింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతలకు విశేష గుర్తింపు దక్కుతుందని తెలిపారు. రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య సమన్వయం, వృత్తిపరమైన అనుభవాల మార్పిడి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రవి, నాగేశ్వరరావు, రవీందర్, వెంకటేష్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మతల్లి దివ్య కళ్యాణోత్సవంలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

### ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన.



వేములవాడ, జూన్ 24 ( వుదయం ప్రతినిధి): రాజన్న క్షేత్రంలో నిర్వహించిన శ్రీ గంగాదేవి అమ్మవారు--శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. వేములవాడ పట్టణంలోని మూలవాగులో గల గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గంగాదేవి అమ్మవారికి, శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గంగాదేవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాజన్న క్షేత్ర మహిమ దేశవ్యాప్తంగా మరింత విస్తరించాలని, స్వామివారి కృప భక్తులందరిపై ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. దివ్య కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన కళ్యాణ మహోత్సవం ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. అనంతరం భక్తులు స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు పంపరి శంకర్, దేవయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# వాస్కులర్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### -యశోద హాస్పిటల్ సీనియర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్



పెద్దపల్లి జూన్ 24 (వుదయం ప్రతినిధి) కాళ్ల నొప్పులు కేవలం మోకాళ్ల నొప్పులు లేదా నరాల బలహీనత అని భావించి నిర్లక్ష్యం చేయడం ప్రాణాపాయానికి దారితీయవచ్చునని, కాళ్లకు రక్త ప్రసరణ తగ్గే వాస్కులర్ డిసీజ్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సీనియర్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన యాంపుటేషన్ ఫ్రీ ఇండియా ప్రచారంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఛాతీ నొప్పిని గుండె సమస్యగా ఎలాగైతే గుర్తిస్తారో, అలాగే కాళ్లలో తీవ్రమైన నొప్పి, నడిచినప్పుడు కాళ్లు బిగుతుగా మారడం, చర్మం రంగు మారడం, కాళ్ల వాపులు లేదా వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే అది రక్తనాళాల సమస్య కావచ్చని గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన వారు, ధూమపానం చేసేవారు, మద్యం అలవాటు ఉన్నవారు, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు మరియు ఎక్కువ సేపు కదలకుండా కూర్చుని పనిచేసే వారు వాస్కులర్ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువని ఆయన వివరించారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే 80 నుండి 90 శాతం వరకు మందుల ద్వారానే నయం చేయవచ్చు. సమస్య తీవ్రమైతే శస్త్రచికిత్స అవసరమవుతుంది, కానీ సకాలంలో చికిత్స పొందితే కాలును తొలగించాల్సిన పరిస్థితిని పూర్తిగా నివారించవచ్చని, అకస్మాత్తుగా కాళ్లలో తీవ్రమైన నొప్పి వచ్చినప్పుడు 24 గంటల లోపు స్పందించి సరైన చికిత్స అందితే, రక్తనాళాల్లోని గడ్డలను కరిగించి కాలును కాపాడుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఏదైనా సమస్య ఉన్నప్పుడు స్థానిక వైద్యులను సంప్రదించి, పరిస్థితి తీవ్రతను బట్టి వెంటనే వాస్కులర్ నిపుణులను సంప్రదించాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలోని రోగుల కోసం యశోద హాస్పిటల్‌లో ప్రత్యేక అపాయింట్‌మెంట్ సౌకర్యం అందుబాటులో ఉందని, ఈ అవగాహన సదస్సు ద్వారా జిల్లాలో యాంపుటేషన్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని డాక్టర్ ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రభాకర్ తోపాటు యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ సిబ్బంది లక్ష్మణ్ లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

## విద్యార్థులు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

### - కాలేజీ సి.పి.డి.సి. కమిటీ



జమ్మికుంట, జూన్ 24 (వుదయం, ప్రతినిధి) పట్టణంతో పాటు చుట్టు పక్కన ఉన్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సి.పి.డి.సి.( కాలేజ్ ప్లానింగ్ డెవలప్మెంట్ కమిటి) సభ్యులు కోరారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.రమేష్ అధ్యక్షతన సిపిడిసి కమిటి సమావేశం జరిగింది. కళాశాల అభివృద్ధి నూతన కోర్సులు, మౌళిక వసతులు, తదితర అంశాలపై చర్చించారు, కళాశాలలోని వసతులు, అధ్యాపకుల సేవలు, భోదన, కళాశాల ప్రగతి పట్ల కమిటి సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే కోర్సులు , మౌళిక వసతులు, డిజిటల్ లైబ్రరీ , కంప్యూటర్ ల్యాబ్, ఖాఖజ సెంటర్, అనుభవం, అర్హతగల అధ్యాపకులు ఉన్నారని ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సి.పి.డి.సి. సభ్యులు డాక్టర్ పుల్లూరి సంపత్ రావ్ , మొలుగూరి సదయ్య, టంగుటూరి రాజ్‌కుమార్ , ఆకుల రాజేందర్, యండి.అన్వర్ బాబు, మైస మహేందర్, డాక్టర్ ఓదెలు కూమార్, డాక

## ఒరాకిల్ ఏడాదిలో 21వేల మంది తొలగింపు..





ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ భారీస్థాయిలో ఉద్యోగాలకు కోతపెట్టింది. గత 12 నెలల్లో 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించింది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను భాగం చేయడంతో ఉద్యోగులను తగ్గించుకోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులోనూ ఈ కోతలు కొనసాగుతాయని వెల్లడించింది. ఈ లేఆఫ్‌లతో ఉద్యోగుల సంఖ్య 1,41,000కు పడిపోయింది. 9




# 2035 నాటికి 10 GW అణు విద్యుత్ సామర్థ్యమే లక్ష్యం: గౌతమ్ అదానీ





దేశీయ ఇంధన అవసరాలు తీర్చడమే లక్ష్యంగా 2035 నాటికి 10 గిగావాట్ల అణుశక్తి (GW) సామర్థ్యాన్ని సాధించాలని అదానీ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడించారు. 'అదానీ అటామిక్ ఎనర్జీ' ద్వారా తమ గ్రూప్ అణుశక్తి రంగంలోకి అడుగుపెడుతున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం జరిగిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో ప్రసంగించిన ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. న్యూక్లియర్ పవర్ వెంచర్ కోసం ఇప్పటికే భూమిని గుర్తించామని గౌతమ్ అదానీ తెలిపారు. భారతదేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు ఈ పెట్టుబడులు సహాయపడతాయని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడే అవసరాన్ని తగ్గిస్తుందని తెలిపారు. థర్మల్, పునరుత్పాదక, హైడ్రో, గ్యాస్ వంటి కీలక ఇంధన రంగాల్లో ఈ సంస్థ పెట్టుబడులను వేగవంతం చేస్తున్న వేళ ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ రూ.1.5 లక్షల కోట్లు మౌలిక వసతుల కల్పనపై ఖర్చు చేసిందని గౌతమ్ అదానీ తెలిపారు. ప్రైవేటు రంగ పెట్టుబడుల్లో 30 శాతం వాటా అదానీ గ్రూప్‌దేనని పేర్కొన్నారు. తమ కంపెనీపై కొందరు సందేహాలను సృష్టించడానికి ప్రయత్నించినప్పటికీ.. వాటాదారులు వాటిని సమర్థంగా తిప్పికొట్టారంటూ పరోక్షంగా హిండెన్‌బర్గ్ వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఈ ఏడాది ప్రారంభంలో రైట్స్ ఇష్యూ ద్వారా రూ.25 వేల కోట్లు సమీకరించామని, కంపెనీపై ఉన్న విశ్వసనీయతకు ఇది నిదర్శనమన్నారు. అదానీ టోటల్ గ్యాస్ పైప్డ్ నేచురల్ గ్యాస్ (PNG) కనెక్షన్ల సంఖ్య 11 లక్షల మార్కు దాటిందని గౌతమ్ అదానీ ఈ సందర్భంగా వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అదానీ పోర్ట్స్ 500 మిలియన్ టన్నుల కార్గోను హ్యాండిల్ చేసిందన్నారు. 2030 నాటికి 1 బిలియన్ టన్నులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం, గువాహటి విమానాశ్రయంలో కొత్త టెర్మినల్‌ను ప్రారంభించామని, విశాఖపట్నంలో గిగావాట్ స్థాయి డేటా సెంటర్ ప్రాజెక్ట్ కోసం గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని ఏజీఎం వేదికగా తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ సంయుక్తంగా రూ.2.92 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని గౌతమ్ అదానీ తెలిపారు.

# తగ్గిన బంగారం ధరలు.. నాలుగు నెలల కనిష్ఠానికి చమురు




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు దిగొస్తున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర (Oil Prices) నాలుగు నెలల కనిష్ఠానికి పడిపోయింది. అటు బంగారం (Gold Rates), వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అమెరికా డాలర్ విలువతో పాటు అక్కడ బాండ్ రాబడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ లోహాలకు గిరాకీ తగ్గింది. దీంతో వీటి ధరలు పతనమవుతున్నాయి. బుధవారం ఉదయం 9.30 గంటల సమయానికి అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం (Gold) ధర దాదపు 70 డాలర్లు తగ్గి 4057 డాలర్లకు పరిమితమైంది. ఔన్సు వెండి ధర 60.95 డాలర్లు పలికింది. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర దాదాపు రూ.2000 క్షీణించి రూ.1,47,100కు దిగొచ్చింది. కిలో వెండి (Silver) ధర దాదాపు రూ.4వేలు తగ్గి రూ.2.29 లక్షలు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ ఈ లోహాల ధరలు 1శాతం మేర క్షీణించాయి. గోల్డ్ ఆగస్టు ఫ్యూచర్స్‌లో 10 గ్రాముల ధర రూ.1,44,759గా ఉంది. జులై ఫ్యూచర్స్‌లో వెండి కిలో ధర రూ.2.24లక్షలుగా ట్రేడ్ అవుతోంది. ఈ ఏడాది చివరి నాటికి వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని ఫెడ్ సంకేతాలిచ్చింది. దీంతో డాలర్ ఇండెక్స్ తొలిసారి 100 మార్క్ దాటింది. ఈ క్రమంలోనే బంగారం, వెండిలో పెట్టుబడులను మదుపర్లు వెనక్కి తీసుకుంటున్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా.. అంతర్జాతీయ మార్కెట్‌లో బుధవారం ముడి చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. బ్రెంట్ క్రూడ్ (Brent Crude Oil) బ్యారెల్ ధర నాలుగు నెలల కనిష్ఠానికి తగ్గి 76.54 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.69 డాలర్లకు దిగొచ్చింది. హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు మొదలవడం, ఇరాన్ చమురుకు అమెరికా ఆంక్షల మినహాయింపుల వంటి కారణాలతో మార్కెట్‌లో చమురు లభ్యత పెరిగింది. దీంతో వీటి ధరలు దిగొస్తున్నాయి. రానున్న రోజుల్లో చమురు ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే భారత్‌పై దిగుమతుల భారం తగ్గుతుంది. ఫలితంగా రూపాయి విలువ పుంజుకోవడంతో పాటు ద్రవ్యోల్బణ భయాలు వీడుతాయి. అయితే, ఈ పరిణామాలతో సామాన్య వినియోగదారులకు తక్షణఊరట లభించే అవకాశం లేదు. రిటైల్ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గేందుకు కొంతకాలం వేచిచూడక తప్పదనినిపుణులు పేర్కొంటున్నారు.

# 1 నుంచి న్యాక్ ప్యాకేజింగ్ ఐపీఓ..




ప్యాకేజింగ్ సొల్యూషన్స్ ప్రొవైడర్ న్యాక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ ఐపీఓ (Knack Packaging IPO) జులై 1న ప్రారంభం కానుంది. జులై 3న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా దాదాపు రూ.440 కోట్లను సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు విలువ రూ.161-170గా కంపెనీ నిర్ణయించింది. రూ.2,080 కోట్ల మార్కెట్ విలువతో కంపెనీ ఐపీఓకు వస్తోంది. ఒక రోజు ముందుగానే (జూన్ 30) యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ విండో తెరుచుకోనుంది. ఐపీఓలో భాగంగా ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.380 కోట్ల విలువైన షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.59.5 కోట్ల విలువైన షేర్లు విక్రయానికి రానున్నాయి. రెండూ కలిపి మొత్తం రూ.439.5 కోట్లను పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ సమీకరించనుంది. ఇన్వెస్టర్లు ఒక బిడ్‌కు కనీసం 88 షేర్లను (లాట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే షేరు గరిష్ఠ ధర వద్ద రూ.14,960 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇష్యూలో సగభాగం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 35 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. కంపెనీ షేర్లు స్టాక్ మార్కెట్లో జులై 8న లిస్టింగ్ కానున్నాయి. సిస్టమాటిక్స్ కార్పొరేట్ సర్వీసెస్, ఐడీబీఐ క్యాపిటల్, పాంటోమ్యాథ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ లీడ్ మేనేజర్లుగా ఉన్నారు. తాజా షేర్ల ద్వారా సమీకరించిన నిధులను కొత్త తయారీ కేంద్రాల మౌలిక సదుపాయాలకు వినియోగించనున్నట్లు కంపెనీ పేర్కొంది. మిగిలిన మొత్తాన్ని కంపెనీ కార్యకలాపాలకు ఉపయోగించనుంది. న్యాక్ ప్యాకేజింగ్ కంపెనీ అహ్మదాబాద్ కేంద్రంగా ప్రింటెడ్, లామినేటెడ్ వోవెన్ పాలిప్రొపైలిన్ (PLWPP) బ్యాగులు, PLWPP పించ్-బాటమ్ బ్యాగులను తయారుచేస్తుంది.

## తనిష్క్ నుంచి సోల్స్ ఇన్ సింఫనీ కలెక్షన్

TANISHQ

టాటా గ్రూప్ ఆభరణాల బ్రాండ్ తనిష్క్, సహజ వజ్రాల కలెక్షన్ 'సోల్స్ ఇన్ సింఫనీ'ని మార్కెట్‌లోకి విడుదల చేసింది. 100% సహజమైన వజ్రాలు, అత్యంత విలువైన రత్నాలతో రూపొందించిన ఈ ప్రత్యేక ఆభరణాలు, ఆధునిక మహిళల మధ్య సత్సంబంధాలు, సోదరీభావం, స్నేహబంధాల భావనతో రూపొందించారు. 18 క్యారెట్ల బంగారంతో, సంప్రదాయ కళా నైపుణ్యానికి ఆధునిక హంగులు జతచేసి ఈ ఆభరణాలు రూపొందించారు. తెల్లటి సహజ వజ్రాలకు కుషన్, పియర్, ఓవెల్, ఎమరాల్డ్, రౌండ్ కట్‌లలో ఉండే రంగురంగుల సహజరత్నాలను మిళితం చేశారు. కార్యాలయాలకు రోజువారీ పెట్టుకెళ్లేందుకు, ప్రత్యేక పార్టీలు, ఫంక్షన్ల వరకు.. భిన్న సందర్భాలకు సరిపోయేలా వీటిని డిజైన్ చేశారు.

# క్విక్‌కామర్స్‌లో మరింత పోటీ.. 3




క్విక్ కామర్స్ విభాగంలో పోటీ మరింత తీవ్రం కానుంది. ప్రస్తుతం ఈ విభాగంలో బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో పోటీ పడుతుండగా.. ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ కూడా ఈ మధ్యే రేసులోకి దిగింది. ప్రస్తుతం ప్రధాన నగరాలకే పరిమితమైన తన 'అమెజాన్ నౌ' క్విక్ కామర్స్ సేవలను మరింత విస్తరించనుంది. దేశంలోనే అతిపెద్ద క్విక్ కామర్స్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే లక్ష్యంతో 300 నగరాలకు అమెజాన్ నౌ సేవలను విస్తరించనున్నట్లు కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ ప్రకటించారు. భారత్ పర్యటనకు వచ్చిన ఆయన.. బుధవారం అమెజాన్ మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విస్తరణ ప్రణాళికను ప్రకటించారు. ప్రస్తుతం అమెజాన్ నౌ సేవలు హైదరాబాద్, బెంగళూరు, దిల్లీ- ఎన్‌సీఆర్, ముంబయి, పుణె వంటి 15కు పైగా నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. దీనిని మరింత వేగంగా విస్తరించడానికి మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను అమెజాన్ భారీగా పెంచనుంది. 300 నగరాలకు ఈ సేవలను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. అమెజాన్ నౌ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ప్రతి త్రైమాసికంలో ఆర్డర్లు రెట్టింపు అవుతున్నాయని అమెజాన్ ఇండియా అధిపతి సమీర్ కుమార్ తెలిపారు. అమెజాన్ ఇండియా చరిత్రలోనే ఇది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బిజినెస్ యూనిట్‌గా నిలిచిందన్నారు.

మరోవైపు డెలివరీ భాగస్వాముల సంక్షేమం కోసం అమెజాన్ 'సమ్మాన్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. డెలివరీ ఏజెంట్ల పిల్లల విద్య కోసం స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. వారికి మెరుగైన ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యం కల్పిస్తారు. దీంతోపాటు డెలివరీ బాయ్స్ విశ్రాంతి తీసుకోవడం కోసం ఏర్పాటు చేసిన ఆశ్రయ్' విశ్రాంతి కేంద్రాలను ఈ ఏడాది 250కి పెంచనున్నట్లు అమెజాన్ ఓ ప్రకటనలో తెలిపింది.




## పాక్ పని పట్టారు



హాకీలో దశాబ్దానికి పైగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై ఆధిపత్యం ప్రదర్శిస్తున్న భారత్.. మరోసారి సత్తా చాటింది. మంగళవారం లండన్ అంచె ప్రో హాకీ లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-3తో పాక్‌ను ఓడించింది. ఈ పోరులో ఆరంభం మాత్రం పాక్‌దే. ఎనిమిదో నిమిషంలో అహ్మద్ నదీమ్ గోల్‌తో ఆ జట్టు ఆధిక్యంలో నిలిచింది. రెండో క్వార్టర్‌లో అభిషేక్ (22వ) పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేయడంతో భారత్ స్కోరు సమం చేసింది. మరో రెండు నిమిషాల్లోనే నీలకంఠ శర్మ గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత సుఖ్‌జీత్ సింగ్ (40వ), రాజిందర్ సింగ్ (52వ) గోల్స్‌తో 4-1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. ఆఖరి క్వార్టర్‌లో అబు మహ్మద్ (53వ), మొయిన్ షకీల్ (60వ) పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేయడంతో పాక్ 3-4తో ఆధిక్యాన్ని తగ్గించగలిగింది.

## మెస్సిపై ప్రశ్నలు..

# క్రిస్టియానో రొనాల్డోకు కోపమొచ్చింది!

ఆరోసారి ప్రపంచ కప్ బరిలోకి దిగిన పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో ఫామ్‌లోకి వచ్చాడు. మొదటి మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపించని అతడు.. రెండో మ్యాచ్‌లో ఉజ్బెకిస్థాన్‌పై అదరగొట్టాడు. రెండు గోల్స్ సాధించి మరీ తన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో ఆరు వరల్డ్ కప్‌ల్లో గోల్స్ సాధించిన ప్లేయర్‌గా నిలిచాడు. పోర్చుగల్ 5-0 తేడాతో ఉజ్బెకిస్థాన్‌పై గెలిచిన అనంతరం రొనాల్డో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. అయితే, అక్కడ అతడి ఎదుట అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి గురించి ప్రశ్నలు ఎదురు కావడంతో కాస్త అసహనానికి గురయ్యాడు. ఇప్పుడు ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అసలేం జరిగిందంటే? ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఓ జర్నలిస్ట్ ప్రశ్న అడుగుతూ.. ''నిన్న లియోనెల్ మెస్సి రెండు గోల్స్ చేశాడు. ఎంబాపె కూడా..'' అని అడిగేలోపే రొనాల్డో తన తలను మరోవైపు తిప్పేశాడు. మరో ప్రశ్న అడగమని వేరే రిపోర్టర్‌కు సూచించాడు. అయితే, ''మీరు అడిగే ప్రశ్నను బట్టి.. నా సమాధానం ఉంటుంది. లేకపోతే లేదు'' అని వ్యాఖ్యానించడం వీడియోల్లో రికార్డైంది. టోర్నీలో అర్జెంటీనాతో మ్యాచ్ ఆడాల్సినప్పుడు ఎలా భావిస్తారు? అనే ప్రశ్నకు రొనాల్డో సమాధానం ఇచ్చాడు. ''ఇప్పుడు ఆ ప్రశ్నకు సమాధానం ఏం చెప్పాలో తెలియడం లేదు. ఇది అర్థంలేని ప్రశ్న. కానీ, ఆ జట్టుతో మ్యాచ్ అద్భుతంగా ఉంటుంది'' అని తెలిపాడు. ప్రెస్ కాన్ఫరెన్స్ ముగించుకొని వెళ్తుండగా, ఓ విలేకరి ''మెస్సి హ్యాట్రిక్ కొట్టాడు'' అని ప్రస్తావించగా.. ''ఇతరుల గురించి నేను పెద్దగా పట్టించుకోను'' అని సమాధానం ఇస్తూ వెళ్లిపోయాడు.




# ఆ కామెంట్లకు ఫుల్‌స్టాప్ పడేలా.. రో-కోపై నిర్ణయం తీసుకోండి: అశ్విన్



వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగానే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సన్నద్ధమవుతున్నారు. కేవలం 50 ఓవర్ల ఫార్మాట్ లోనే కొనసాగుతోంది కూడా అందుకోసమే. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కూ ఇద్దరు ఎంపికైన సంగతి తెలిసిందే. మరో వైపు వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్‌లో వీరిద్దరికి చోటు దక్కడం కష్టమేనన్న వాదనా ఉంది. ఈ విషయంలో మేనేజ్‌మెంట్ కూడా స్పష్టత ఇవ్వడం లేదు. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశాడు. రో-కోపై కొందరు ఎక్కువగా నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని.. సెలక్టర్లు త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నాడు. ''రోహిత్, విరాట్ గురిం చి వస్తోన్న వార్తలు బాగోలేవు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని బలంగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో తెలియదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడతారు. మరికొందరు మాత్రం విరాట్, రోహిత్ ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉండటం ముఖ్యం'' అని అశ్విన్ తెలిపాడు. ''వన్డే ప్రపంచ కప్‌లో విరాట్, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. మున్ముందు ఈ అంశం సంక్లిష్టంగా మారే అవకాశం ఉంది'' అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

# రైజర్స్ జోరు

టీజీ20లో రంగారెడ్డి రైజర్స్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నెగ్గింది. మంగళవారం రాత్రి ఆ జట్టు మెదక్ ఫాల్కన్స్‌పై 5 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తనయ్ త్యాగరాజన్ (3/36), ఆర్యన్ కరియప్ప (2/23) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మెదక్ 8 వికెట్లకు 164 పరుగులే చేసింది. ఫాల్కన్స్ బ్యాటర్లలో విక్రమ్ నాయక్ (49; 38 బంతుల్లో 1×4, 4×6), సాయి పూర్ణానంద్ (38; 20 బంతుల్లో 6×4, 1×6), నమన్ అగర్వాల్ (37; 30 బంతుల్లో 3×4, 2×6) మాత్రమే రాణించారు. రైజర్స్ లక్ష్యాన్ని 18.2 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆరోన్ వర్గీస్ (27; 13 బంతుల్లో 3×4, 2×6), అవనీశ్ రావు (25; 12 బంతుల్లో 2×4, 2×6) జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వగా.. నానావత్ రాకేశ్ (37 నాటౌట్; 33 బంతుల్లో 4×4), తనయ్ త్యాగరాజన్ (21; 11 బంతుల్లో 2×4, 1×6) నితిన్ సాయి (28; 19 బంతుల్లో 2×4, 1×6) సమయోచితంగా రాణించి జట్టును గెలిపించారు. తొలి మ్యాచ్‌లో విధ్వంసక శతకంతో మెదక్‌కు అద్భుత విజయాన్నందించిన తిలక్.. ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడంతో ఆ జట్టు బ్యాటింగ్ బలహీనపడింది. టీమ్‌ఇండియాతో యూకే పర్యటనకు వెళ్తుండడంతో తిలక్ ఇక టీజీ20లో ఆడే అవకాశం లేదు.



# వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం..

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. అతడికి '3' నంబర్ జెర్సీని బీసీసీఐ ఇచ్చింది. మరో రెండు రోజుల్లోనే ఐర్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌ను భారత్ ఆడనుంది. ఈ క్రమంలో టీమ్ఇండియా మాజీ క్రికెటర్, ఐర్లాండ్ మాజీ కోచ్ ఎంవీ నరసింహారావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఐర్లాండ్ - భారత్ మ్యాచ్ నిర్వాహకులు స్టేడియంలో మరిన్ని సీట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బెల్‌ఫాస్ట్ గ్రౌండ్ సీటింగ్ సామర్థ్యం 7 వేలే. యూరప్‌లోని పలు ప్రాంతాల నుంచి మ్యాచ్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున వస్తారు. పారిస్ వంటి ప్రాంతాల నుంచి వైభవ్ సూర్యవంశీ ఆటను చూసేందుకు వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ఐర్లాండ్‌లో అతడు అరంగేట్రం చేస్తే చరిత్రే అవుతుంది. అతడి ఆటను చూసేందుకు చాలా ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం. ఐపీఎల్‌లో అతడి ఆటను టీవీల్లో చూశా'' అని తెలిపాడు. ''ఐర్లాండ్‌లో వైభవ్‌కు పెద్ద ఇబ్బందేమీ ఉండదు. కానీ, ఇంగ్లాండ్ గడ్డపై సవాల్ ఎదురుకానుంది. అక్కడ బంతి గమనం భిన్నమైంది. వాతావరణం కూడా మారిపోతూ ఉంటుంది. అయితే, అతడికి మంచి సిరీస్ అవ్వాలని కోరుకుంటున్నా. నాకెందుకో వైభవ్‌ను చూస్తే గ్యారీ సోబర్స్ గుర్తుకొస్తాడు. అతడి బ్యాటింగ్ స్వింగ్ భలేగుంది. చిన్న వయసులోనే అన్ని రకాల షాట్లను కొట్టగలిగే వైవిధ్యమైన ఆటగాడు. అయితే, సచిన్ మాదిరిగానే వినయంగా ఉండాలి. క్రమశిక్షణతో ప్రవర్తించడం కొనసాగించాలి.



# వుదయం సినిమా

MOVIE TIME!

## మా "ఒక్కడు" సినిమా రీ రిలీజ్ కావడం చాలా సంతోషంగా ఉంది

**వుదయం సినిమా** సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎమ్మెస్ రాజు గారు నిర్మాతగా ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ దర్శకత్వంలో 2003లో మహేష్ బాబు హీరోగా ప్రేక్షకులకు ముందుకు వచ్చిన చిత్రం ఒక్కడు. సుమారు 23 సంవత్సరాల తర్వాత ఆంధ్ర, తెలంగాణతో పాటు భారతదేశవ్యాప్తంగా 4Kలో తెలుగులో విడుదలవుతుంది. మహేష్ బాబు కమర్షియల్ యాస్పెక్ట్స్ లో కర్నూలు కొండారెడ్డి బురుజు అంటే ఒక్కడు సినిమా అన్నట్లు ఒక మార్క్ సృష్టించి ఇండస్ట్రీ అంతా షేక్ చేసే విధంగా అద్భుతమైన విజయం సాధించిన ఈ చిత్రం రాధా మాధవి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ సమర్పణలో జూన్ 26వ రీ రిలీజ్ కానుంది. గుణ శేఖర్ కెరియర్ లో అలాగే మహేష్ బాబు కెరియర్ లో ఒక మైల్ స్టోన్ గా నిలిచిన ఈ చిత్రం ప్రేక్షకులందరికీ మరోసారి అలరించేందుకు రానుంది.



## 'ధర్మన్' ఫస్ట్ లుక్ రిలీజ్

**వుదయం:** సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త చిత్రం 'ధర్మన్' షూటింగ్‌ను రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (RKFI) ఈ రోజు ప్రారంభించింది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ రోజు ఆవిష్కరించారు. ఇటీవలి కాలంలో భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. 'ది డెడ్లీ డాక్టర్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆపరేషన్ థియేటర్‌లో నిలబడి ఉన్న రజనీకాంత్, ఆపరేషన్ డ్రస్‌తో పాటు డార్క్ గ్లాసెస్ ధరించి కనిపించారు. చేతిలో రక్తపు మరకలు ఉన్న స్కాల్పెల్ పట్టుకుని చిరునవ్వుతో కనిపిస్తున్న ఆయన లుక్ ఎంతో ఆసక్తికరంగా ఉంది. ప్రపంచ చలనచిత్ర చరిత్రలో కమల్ హాసన్, సూపర్ స్టార్ రజనీ కాంత్ మధ్య ఉన్నంత స్నేహ బంధం చాలా అరుదు. భారతీయ చలనచిత్ర రంగంలో ఐదు దశాబ్దాల కు పైగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఈ ఇద్దరు దిగ్గజాలు, 'ధర్మన్' చిత్రం ద్వారా నిర్మాత–నటుడిగా మొదటిసారిగా కలిసి పనిచేస్తున్నారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, RKFI నిర్మాణంలో సూపర్ స్టార్ రజనీ కాంత్ నటించే మొదటి సినిమా కావడం విశేషం. ఇది భారతీయ చలనచిత్ర రంగంలోని అత్యంత ప్రముఖ స్టూడియోలలో ఒకటైన RKFI 46 ఏళ్ల ప్రయాణంలో ఒక గర్వించదగ్గ ఘట్టం. భారతీయ చలనచిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, అత్యంత ఆసక్తికరమైన యువ దర్శకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్టైలిష్‌గా, ఇంటెన్స్‌గా డిజైన్ చేసిన ఈ పోస్టర్ కథలోని యాక్షన్ సూచిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో నిలబడ్డ హీరో లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది.



## 'మా ఇంటి బంగారం' టీమ్‌ను అభినందించిన మెగాస్టార్ చిరంజీవి, శ్రీమతి సురేఖ

**వుదయం:** జూన్ 19న విడుదలై బ్లాక్ బస్టర్ సాధించిన 'మా ఇంటి బంగారం' సినిమా నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను వసూలు చేసింది. ఇప్పుడు ఈ సెన్సేషనల్ సక్సెస్‌ను టీమ్ ఎంజాయ్ చేస్తోంది. ఈ క్రమంలో వారికి వారి ఎనర్జీని, ఉత్సాహాన్ని పెంచే సంఘటన జరిగింది... అదే 'మెగా బంగారం' మూమెంట్. సూపర్ డూపర్ హిట్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ రాబడుతూ దూసుకెళ్తోన్న 'మా ఇంటి బంగారం' ఘన విజయాన్ని అభినందిస్తూ మెగాస్టార్ ట్వీట్ చేశారు. ''మా ఇంటి బంగారం' సినిమాను చూస్తున్నంత సేపు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జాయింట్ ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్, ఎమోషన్స్‌ని చాలా బాగా మిక్స్ చేస్తూ డైరెక్టర్ నందినీ రెడ్డి తన స్టైల్లో సినిమాను ఎంటర్‌టైనింగ్‌గా రూపొందించారు. సమంత నటన గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ముఖ్యంగా ఆమె చీరలో చేసిన యాక్షన్ సీన్స్ చాలా ఆకట్టుకున్నాయి. మహిళలు ప్రధాన పాత్రల్లో నటించే సినిమాలు తెలుగు ఇండస్ట్రీకి చాలా అవసరం. ఈ విజయాన్ని సాధించిన సమంత, నందినీ రెడ్డి, రాజ్, అలాగే మొత్తం టీమ్‌కు హృదయపూర్వక అభినందనలు. అలాగే తమ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు'' అని ఆయన పేర్కొన్నారు. ట్వీట్ చేయటంతో పాటు చిత్ర యూనిట్‌ను మెగాస్టార్ చిరంజీవి, ఆయన సతీమణి శ్రీమతి సురేఖ ప్రత్యేకంగా ఇంటికి పిలిచి అభినందించారు. మంచి సినిమాలకు తన వంతు సపోర్ట్‌ను అందించే మెగాస్టార్ 'మా ఇంటి బంగారం' సినిమా టీమ్‌ను అభినందించటం ఎంతో ప్రత్యేకం.



## సెప్టెంబర్ 10న 'సర్దార్ 2' రిలీజ్



**వుదయం:** హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ 'సర్దార్ 2'తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్ 2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రం సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అగ్నిపర్వతంలా ఎగిసిపడుతున్న పేలుడు నేపథ్యంలో, చేతిలో తుపాకీతో ధైర్యంగా నిలబడ్డ హీరో లుక్ ... మాళవిక మోహన్, ఆషికా రంగ నాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్ గా నటిస్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్ లో తెరకెక్కుతోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. సామ్ సిఎస్ సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్. AP పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. నటీనటులు – కార్తీ, SJ సూర్య, మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, యోగి బాబు, రజిషా విజయన్.

## విబి ఎంటర్టైన్మెంట్స్ 8వ ఫిలిం & టివి డైరెక్టరీ, డిజిటల్ మీడియా అవార్డ్స్ బహుకరణ

**వుదయం:** విబి ఎంటర్టైన్మెంట్స్ 8వ ఫిలిం & టివి డైరెక్టరీ మరియు డిజిటల్ మీడియా అవార్డ్స్ అందించడం జరిగింది. విష్ణు బొప్పన గారు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ పెద్దలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కెఎస్ రామారావు, తమ్మారెడ్డి భరద్వాజ్, అంబికా కృష్ణ, మాదాల రవి ఈ కార్యక్రమంలో పాల్గొని అవార్డులను అందచేశారు. అన్విత గ్రూప్, NCD నిఖిల కన్స్ట్రక్షన్స్ & డెవలపర్స్, లైట్ హౌస్ సినీ మ్యాజిక్, వివికె హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సెల్ బే మొబైల్స్, ముకుంద జెవెల్లర్స్, శ్రీ భారతి గ్రూప్, అంబికా దర్బార్బత్తి, పొట్ల గ్రూప్ ఆఫ్ కంపెనీస్, మయూరి ఫ్యామిలీ రెస్టారెంట్, శ్రీ & శ్రీమతి స్వప్న శ్రీనివాస్ తదితర స్పాన్సర్స్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా ఫిలిం, టివి, డిజిటల్ & సోషల్ మీడియాలో ప్రసిద్ధి చెందిన వారికి అవార్డులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా కె.ఎస్. రామారావు గారు మాట్లాడుతూ, డిజిటల్ మీడియా అవార్డుల కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందన్నారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ప్రజలకు విజ్ఞానం, మంచి విలువలు, సానుకూల మార్పులు అందించే వేదికలుగా ఉండాలని సూచించారు. అనవసర ట్రోలింగ్, అసభ్యకర కంటెంట్, సినిమాలపై అధిక నెగెటివ్ ప్రచారం సమాజానికి మంచిది కాదన్నారు. క్రియేటర్లు తమ ప్రతిభను ప్రజల చైతన్యానికి, మంచి సందేశాల ప్రచారానికి ఉపయోగించాలని కోరారు.




## 'ఆల్ఫా' ఆటిట్యూడ్‌కు ఒక ప్రతీకలా ఉంటుంది..


అలియా భట్

**వుదయం:** భారీ బడ్జెట్ చిత్రం 'ఆల్ఫా'. ఇండియాలో ఇది వరకెన్నడూ రానట్టుగా అలియా భట్, షర్వారిలతో భారీ బడ్జెట్ యాక్షన్ మూవీని రూపొందించారు. ఆల్ఫా చిత్రం ఆటిట్యూడ్‌కు ఒక వేడుకగా, ప్రతీకగా నిలిచే ఓ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ మూవీ షూటింగ్, అందులోని క్షణాల్ని తాను ఎప్పటికీ మర్చిపోలేను అని అలియా భట్ అన్నారు. .అలియా భట్ మాట్లాడుతూ..''ఆల్ఫా' చిత్రానికి పని చేయడం నాకెంతో ఆనందంగా ఉంది. నేను ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసిన సినిమాల్లో ఇది కూడా ఒకటిగా నిలుస్తుంది. యాక్షన్, గ్రాండియర్, అడ్వెంచర్‌లతో కూడిన ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది నేను మునుపెన్నడూ అనుభవించని ఓ కొత్త ఎక్స్‌పీరియన్స్. షూటింగ్‌లోని ప్రతీ క్షణాన్ని నేను ఎంతో ప్రేమించాను, ఆస్వాధించాను.'ఈ చిత్రంలోని కథ ఇద్దరు మహిళ కథా నాయిక ల చుట్టే తిరుగుతుంది. అదే నాకు ఎక్కువగా నచ్చిన అంశం. ఇలాంటి గొప్ప స్క్రిప్ట్‌లు మనం అరుదుగా చూస్తుంటాం.

## 'వీరభద్రుని రహస్యం'.. జీ5లో జూన్ 26 నుంచి స్ట్రీమింగ్



**వుదయం:** తెలుగు టాప్ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ ZEE5 ప్రేక్షకుల ముందుకు ఒక థ్రిల్లింగ్ మిస్టరీ కథను తీసుకురాబోతోంది. అదే 'మర్మదేశం అనే ప్రపంచం నుంచి 'వీరభద్రుని రహస్యం'. ఇది జూన్ 26 నుంచి జీ5లో ప్రీమియర్ కానుంది. 1990ల్లో టెలివిజన్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ కల్ట్ మిస్టరీ సిరీస్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. అలాగే తెలుగు ఐఎండీబీ హయ్యస్ట్ రేటింగ్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. రహస్యాలతో నిండిన వీరభద్రపురం అనే గ్రామ నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో.. నమ్మకం ఆజ్ఞలను విధించే శక్తిగా మారి..భయం ప్రతి రోజూ అక్కడి ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తుంది. దేవుడిపై ఉన్న గాఢ విశ్వాసం నీడలో దాగి ఉన్న ఎన్నో రహస్యాలు ఈ కథలో వెలుగులోకి రాబోతున్నాయి.కథ విషయానికి వస్తే.. తరతరాలుగా వీరభద్రపురం గ్రామ ప్రజలు తమ గ్రామ దైవం వీరభద్ర స్వామి అండలో జీవిస్తుంటారు.

## 'సూపర్ సుబ్బు' నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్



**వుదయం సినిమా** ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ తన తొలి తెలుగు ఒరిజినల్ కామెడీ సిరీస్ 'సూపర్ సుబ్బు' ట్రైలర్‌ను విడుదల చేసింది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సిరీస్ జూలై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ వినోదాత్మక కథలో సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు చిల్లుకూరి రావు అనే టీచర్ పాత్రలో సందీప్ కిషన్ ఆకట్టుకున్నారు. ఎలాంటి ఉపాధ్యాయుడూ వెళ్లాలని అనుకోని మాకిపూర్‌కు అతడికి పోస్టింగ్ వస్తుంది. కుటుంబం ముందు పరువు నిలబెట్టుకోవాలని భావించి అక్కడికి వెళ్లిన సుబ్బుకు ఊహించని విధంగా సెక్స్ ఎడ్యుకేషన్ బోధించే బాధ్యత అప్పగిస్తారు ఆ తర్వాత జరిగే సంఘటనలు, గ్రామస్తులతో ఏర్పడే అపార్థాలు, హాస్యభరిత పరిస్థితులు కథను ఆసక్తికరంగా ముందుకు తీసుకెళ్తాయి. గ్రామాన్ని మార్చాలనుకున్న సుబ్బు, చివరికి ఆ గ్రామమే తన జీవితాన్ని మార్చేస్తుందనే ఎమోషల్ ఎలిమెంట్‌ని కూడా ఈ సిరీస్ టచ్ చేస్తోంది . ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ.. సూపర్ సుబ్బు సాధారణంగా ప్రజలు మాట్లాడటానికి సంకోచించే అంశాన్ని హాస్యం, హృదయానికి హత్తుకునే భావోద్వేగాలతో చెప్పే ప్రయత్నం. సుబ్బు ఒక సమస్యను పరిష్కరించాలనుకుని చివరికి మరిన్ని సమస్యల్లో చిక్కుకుంటాడు. ఉద్యోగ సమస్యలు, ప్రేమలో ఎదురయ్యే ఇబ్బందులు, కుటుంబ ఒత్తిళ్లు, గ్రామస్తులతో వచ్చే అపార్థాలు కథను మరింత వినోదాత్మకంగా మారుస్తాయి.

## VB ఎంటర్‌టైన్‌మెంట్స్ డిజిటల్ మీడియా అవార్డ్స్ 2026 ప్రదానోత్సవం




**వుదయం సినిమా** ప్రస్తుత డిజిటల్ యుగంలో సమాచార వ్యవస్థ పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు వార్తల కోసం దినపత్రికలు, టెలివిజన్లపై ఆధారపడిన ప్రజలు, ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ల ద్వారా క్షణాల్లో కంటెంట్‌ను పొందుతున్నారు. సినిమా, ఓటీటీ అప్‌డేట్లతో పాటు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వెబ్‌సైట్లు నేడు వినోద రంగాన్ని శాసిస్తున్నాయి. ఈ అద్భుతమైన డిజిటల్ విప్లవం వెనుక ఎందరో కంటెంట్ క్రియేటర్లు, జర్నలిస్టులు, ఎడిటర్ల నిరంతర కృషిదాగి ఉంది. వారి ప్రతిభను, అంకితభావాన్ని గుర్తించి గౌరవించేందుకు VB ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రతిష్టాత్మక "డిజిటల్ మీడియా అవార్డ్స్ 2026" ప్రధానోత్సవాన్ని జూన్ 24న ఘనంగా నిర్వహించింది.

### శివ కుమార్ బోయిదాపుకు 'బెస్ట్ వెబ్‌సైట్ ఎడిటర్ అవార్డ్'

ఈ 2026 అవార్డుల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన "బెస్ట్ వెబ్‌సైట్ ఎడిటర్ అవార్డ్" (Best Website Editor Award) ప్రముఖ సినీ పోర్టల్ 'ఇండస్ట్రీ హిట్' అధినేత శివ కుమార్ బోయిదాపు (Shiva Kumar Boidapu) గారిని వరించింది. తెలుగు డిజిటల్ జర్నలిజంలో తనదైన ముద్ర వేసిన శివ కుమార్ గారు, కేవలం వేగంగా వార్తలను అందించడమే కాకుండా, వాటి వెనుక ఉన్న యదార్థాలను విశ్లేషణాత్మకంగా పాఠకులకు చేరవేయడంలో దిట్ట. సినిమా కంటెంట్ అయినా, సామాజిక అంశాలైనా ఆయన కథనాల్లో నిజాయితీ స్పష్టంగా కనిపిస్తుంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.